ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కూడా గడవకముందే టీడీపీలోని ముఖ్య నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. గెలిచిన స్థానాల్లో.. గెలిచిన అభ్యర్థికి, పార్టీలోని ముఖ్య నాయకులకు. ఓడిన స్థానాల్లో.. పోటీ చేసిన అభ్యర్థికి, పార్టీలోని ముఖ్యనాయకులకు మధ్య పొసగడం లేదు. ఇప్పటికే రాజంపేట నియోజకవర్గంలో ఇన్‌చార్జ్ విషయమై కుమ్ములాటలు రాష్ట్ర స్థాయిలో రచ్చగా మారాయి. తాజాగా మదనపల్లె నియోజకవర్గంలోనూ టీడీపీలో గొడవలు బయటపడ్డాయి. ఇలా పార్టీలో ఒక విధంగా చెప్పాలంటే జిల్లాలోని ఏ ఒకటో.. రెండో స్థానాలు మినహా.. మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ.. టీడీపీలో కుమ్ములాటలు జరుగుతున్నాయి.



నిన్న రాజంపేట..
నేడు మదనపల్లె



- కుమ్ములాటల్లో టీడీపీ నాయకులు
- ఆధిపత్యం కోసం పాకులాట..
- నలిగిపోతున్న సామాన్య కార్యకర్తలు
- గ్రూపుల మధ్య ఆజ్యం పోస్తున్న సమన్వయకర్తలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో భారీ మెజార్టీతో వైసీపీ గెలుపొందింది. రాజంపేట పార్లమెంటు స్థానాన్ని ఆ పార్టీనే సొంతం చేసుకుంది. దీనిని బట్టి జిల్లాలో వైసీపీ ఎంత బలంగా ఉందో సులభంగా చెప్పేయవచ్చు. అనంతరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వైసీపీ విజయ దుందుభి మోగించింది. అయితే జస్ట్ ఐదేళ్లు గడిచేసరికి సీన్ రివర్స్ అయింది. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని ఆరు స్థానాల్లో నాలుగు స్థానాలు కూటమి గెలుచుకోగా రెండు స్థానాల్లో వైసీపీ గెలిచింది. మదనపల్లె, పీలేరు, రాయచోటిలో తెలుగుదేశం, రైల్వేకోడూరులో జనసేన గెలిచాయి. రాజంపేట, తంబళ్లపల్లె స్థానాల్లో వైసీపీ గెలిచింది. ఇంతటి ఘన విజయం వెనుక టీడీపీ కార్యకర్తల అలుపెరగని పోరాటం ఉందని చెప్పడంలో సందేహం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు ఎన్నో వేధింపులు, కేసులను ఎదుర్కొన్న టీడీపీ నాయకులు పార్టీ గెలుపుకోసం సర్వశక్తులూ ఒడ్డారు. ఓడిన ఆ రెండు స్థానాల్లో కూడా కొందరు టీడీపీ ముఖ్య నాయకులు లోలోపల వైసీపీకి మద్దతు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. పోటీలో ఉన్న అభ్యర్థులు గెలిస్తే.. తమ రాజకీయ జీవితానికి ఇబ్బందిగా భావించిన సదరు నాయకులు శల్య సారథ్యం వహించినట్లు ఆయా నియోజకవర్గాల్లో సాధారణ టీడీపీ కార్యకర్తలు ఇప్పటికీ ఆవేదన చెందుతూనే ఉన్నారు ఈ ఎన్నికల్లో అఖండ విజయం సాధించినప్పటికీ టీడీపీలోని ముఖ్యనాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. సమస్యలను సర్దుబాటు చేయాల్సిన సమన్వయకర్తలు, ముఖ్య బాధ్యులు గ్రూపు తగాదాలను సరిదిద్దే పనిచేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

తారాస్థాయికి కుమ్ములాటలు

జిల్లాలోని ఆరు నియోజకవర్గాలు ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి కంచుకోటలుగా ఉండేవని చెప్పవచ్చు. అయితే 2012లో జరిగిన ఉపఎన్నికలు, వైసీపీ ఆవిర్భావం తర్వాత జిల్లా వైసీపీకి కంచుకోటగా మారిందనే చెప్పవచ్చు. 2014 ఎన్నికల్లో రాజంపేట మినహా మిగిలిన చోట్ల వైసీపీనే గెలుపొందింది. 2019లో అన్ని స్థానాలనూ వైసీపీనే కైవసం చేసుకుని తమ కంచుకోటలుగా మార్చుకుంది. అయితే 2024 ఎన్నికల్లో ఆరింటిలో నాలుగు గెలుచుకుని వైసీపీ కంచుకోటలను టీడీపీ బద్దలు కొట్టింది. దీని వెనుక జిల్లాలోని టీడీపీ కార్యకర్తల కృషి, పోరాటం గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. చంద్రబాబు అరెస్టు తర్వాత.. నెలల తరబడి ప్రతి నియోజకవర్గంలోనూ.. కార్యకర్తలు రోడ్డెక్కారు. అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలతో హోరెత్తించారు. గతేడాది ఆగస్టులో అంగళ్లలో చంద్రబాబునాయుడుపైన వైసీపీ నాయకులు రాళ్లదాడికి పాల్పడి ఆయన పర్యటనను అడ్డుకున్నారు. అయితే విచిత్రంగా చంద్రబాబుతో సహా పలువురు ముఖ్య నాయకులు, వందలాది మంది కార్యకర్తలపైన అక్రమ కేసులు బనాయించారు. అప్పట్లో పోలీసులు తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో సుమారు 750 మంది టీడీపీ కార్యకర్తలను అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు పంపించారు. అలా కేసుల్లో చిక్కుకున్న కార్యకర్తలు, నాయకులు జైలుకు వెళ్లారే కానీ.. ఏ ఒక్కరూ వైసీపీతో రాజీకి యత్నించలేదు. ఈ ఒక్క సంఘటనను బట్టే జిల్లాలో టీడీపీ ఘన విజయం వెనుక కార్యకర్తల పోరాటం ఎంత ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. అయితే ప్రస్తుతం జిల్లా టీడీపీలో జరుగుతున్న పరిణామాలను చూసి నిజమైన కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో త్యాగాలు చేసి పార్టీని గెలిపిస్తే.. కొందరి నాయకుల స్వార్థంతో పార్టీకి చెడ్డ పేరు వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

నిన్న రాజంపేట.. నేడు మదనపల్లె

రాజంపేట అసెంబ్లీ స్థానానికి మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు కుమారుడు సుగవాసి బాలసుబ్రమణ్యం పోటీ చేసి ఓడిపోయారు. జిల్లాలో కచ్చితంగా ఇక్కడ టీడీపీ గెలుస్తుందని చంద్రబాబునాయుడు, నారా లోకేశ్ ఊహించారు. అయితే అనూహ్యంగా ఇక్కడ పార్టీ అభ్యర్థి ఓటమి చెందారు. దీని వెనుక కొందరు టీడీపీలోని ముఖ్యనాయకుల పాత్ర ఉందనే ఆరోపణలు ఉన్నాయి. తమ రాజకీయ భవిష్యత్తు కోసమే పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్ల నుంచే ఇక్కడ ఇన్‌చార్జ్ విషయమై ముఖ్యనాయకుల మధ్య వివాదం నడుస్తోంది. సాధారణంగా టీడీపీ పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులనే నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా కొనసాగించడం ఆనవాయితీ. అయితే ఇక్కడ మాత్రం ఓడిపోయిన సుబ్రమణ్యంను కాదని.. ఇతరులు ఇన్‌చార్జ్ పదవిని ఆశిస్తుండడం విశేషం. రాజంపేట పట్టణంలో అన్నాక్యాంటీన్ ప్రారంభం సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలసుబ్రమణ్యం, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజుల మధ్య వివాదం జరిగింది. ఈ సమస్యను మొగ్గ దశలోనే తుంచివేయాల్సిన పార్టీలోని కొందరు ముఖ్యనాయకులు, పెద్దలు వివాదానికి మరింత ఆజ్యం పోశారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ను కాదని. జిల్లా అధ్యక్షుడి పేరుతో సిమెంటు రోడ్డు పనులను ఈ నియోజకవర్గంలో కేటాయించారు. రాష్ట్రంలోనే రాజంపేట సభ్యత్వ నమోదులో ముందంజలో ఉంది. అయితే ప్రస్తుతం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా పార్టీలోని ముఖ్యనాయకులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రాజంపేట రచ్చ మర్చిపోకముందే మదనపల్లె నియోజకవర్గంలోనూ వివాదం తలెత్తింది. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, తెలుగు యువత నాయకుడు శ్రీరామ్ చినబాబుల మధ్య ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అంతర్గత పోరు నడుస్తోంది. నాలుగు రోజుల కిందట ఇరువురి నాయకుల అనుచరులు సోషల్ మీడియా వేదికగా పలు ఆరోపణలు చేసుకున్నారు. తహసీల్దార్ ఖాజాబీ కేంద్రంగా ఈ వివాదం, ఆరోపణలు జరుగుతున్నాయి. ఎన్నికల్లో తనకు శ్రీరామ్ చినబాబు పనిచేయలేదనే భావనలో ఎమ్మెల్యే ఉండగా.. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పని చేసిన తమను అసలు పట్టించుకోవడం లేదనే భావన చినబాబులో ఉంది. దీంతో ఇరువర్గాలు ఉప్పునిప్పులా తలపడుతున్నాయి.

తంబళ్లపల్లె నియోజకవర్గంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ వర్గాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. రైల్వేకోడూరులోనూ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి, సీనియర్ టీడీపీ నాయకుడు కస్తూరి విశ్వనాధనాయుడుల మధ్య అసలు పొసగడం లేదు. సాధారణంగా టీడీపీలో క్రమశిక్షణ ఎక్కువ. అయితే ప్రభుత్వం ఏర్పడి కనీసం ఆరు నెలలు కూడా గడవకముందే ఆధిపత్య పోరులో మునిగిన నాయకులను చూసి సామాన్య కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధినాయకత్వం కూడా పార్టీలోని అంతర్గత సమస్యలను పరిష్కరించకుండా చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు ఈ నేపథ్యంలో నిన్న రాజంపేట... నేడు.. మదనపల్లె.. రేపు..? ఏ నియోజకవర్గమో అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



సచివాలయ ఉద్యోగులకు నోటీసులు

- రోజువారీ హాజరు వేయకపోవడంతో జారీ

కలికిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనిమిదిమంది ఉద్యోగులకు శనివారం షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. రోజువారీ హాజరును నమోదు చేయకపోవడంతో ఈ మేరకు ఎంపీడీవో భానుమూర్తి రావు ఈ నోటీసులు జారీ చేశారు. ప్రతిరోజూ ఉదయం 10.30 గంటలకు ఒకసారి, సాయంత్రం 5 గంటలకు చివరిసారి సచివాలయాల్లో బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని గతంలో ఆదేశించినా శనివారం 8 మంది నమోదు చేయకపోవడాన్ని గుర్తించినట్లు ఎంపీడీవో జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్నారు. 24 గంటలలోగా ఎందుకు హాజరు నమోదు చేయలేదో సంజాయిషీ పంపుకోవాలని సూచించారు. నోటీసులు జారీ అయిన వారిలో చీకటిపల్లె ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.అశోక్‌కుమార్, జీఎంఎస్కే రెడ్డి రోజా, మర్రికుంటపల్లె వ్యవసాయ సహాయకురాలు కె.రోషనారా, డిజిటల్ అసిస్టెంట్ పి.ఉమామహేష్, మర్రికుంటపల్లె గ్రామ సర్వేయర్ కె.మహ్మద్ సుఫియాన్, పల్లవోలు వ్యవసాయ సహాయకుడు ఎం.రాజేష్, డిజిటల్ అసిస్టెంట్ కె.రెడ్డివాసుదేవ, వీఆర్వో సుల్తాన్‌బాషాలకు నోటీసులు జారీ అయ్యాయి.

త్వరలో 2 వేల ఎలక్ట్రికల్ బస్సులు

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాజంపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో త్వరలో రెండు వేల ఎలక్ట్రికల్ బస్సులు నడపబోతున్నామని అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వంతో కూడా చర్చలు జరిపారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి రాజంపేట ఆర్టీసీ ప్రాంగణంలో ఆర్టీసీ వారు ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తాము ఎన్నికల హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నామన్నారు. కొంతమంది ఆర్టీసీ ఉద్యోగులు తక్కువగా ఉండడం, బస్సులు తక్కువగా ఉండడం, ఇతర కారణాల వల్ల ఉచిత ప్రయాణ సౌకర్యంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి రాష్ట్రానికి ఏకంగా రెండు వేల ఎలక్ట్రికల్ బస్సులను తేవడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 750 కొత్త బస్సులు కొనుగోలు చేసి రాష్ట్రంలో నడుపుతున్నామని, మరో 700 బస్సులు కొనుగోలు చేసి నడపడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సుబ్బనరసయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్య, అసిస్టెంట్ మేనేజర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెంట్రోల్ బంకును వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో భారీ బాణాసంచా పేల్చుతూ గజమాలలు వేస్తూ మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు.

వామ్మో.. వరి కోతలు

- వరికోత యంత్రాల యజమానుల సిండికేట్
- తమిళనాడు హార్వెస్టర్లు రాకుండా అడ్డగింపు
- గంటకు రూ.3500 చార్జీలు
- కూలీల కొరతతో ఇక్కట్లు
- గత్యంతరం లేక హార్వెస్టర్లను ఆశ్రయిస్తున్న రైతులు
- కుదేలవుతున్న అన్నదాతలు

7





చెన్నముక్కపల్లె హైస్కూల్‌లో పేరెంట్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



నాగన్న స్టేజి ఎక్కితే.. అవార్డుల పంటే

- పౌరాణిక, జానపదంలో ఆయన నటన అద్భుతం
- ఐదువేల ప్రదర్శనలతో నేటికీ కళామతల్లి సేవలోనే..

6

నిఘా నీడలో కలెక్టరేట్

- ప్రతి సెక్షన్‌లోనూ సీసీ కెమెరాలు
- సిబ్బందిపై నిఘా
- ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్న జేసీ



6

ఐదు సంవత్సరాల్లో
విద్యాహబ్‌గా అభివృద్ధి

- ఉపాధ్యాయులను గౌరవిస్తూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఐదు సంవత్సరాల్లో రాష్ట్రాన్ని విద్యాహబ్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవించి మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రభుత్వం టీచర్స్ అండ్ పేరెంట్స్ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నేడు పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అనుసంధానం చేసే విధంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1వ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులకు రుచికరమైన భోజనంతో పాటు దుస్తులు, పుస్తకాలు, నాణ్యమైన విద్యను అందించి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పించే ఈ అవకాశాలన్నీ విద్యార్థులు సక్రమంగా సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికలతో పాటు వారు సాధించే మార్కులు తదితర విషయాలపై దృష్టి సారించి తమ పిల్లలు మంచి మార్గంలో నడిచే విధంగా చూడాలన్నారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో భారతదేశంలోనే మన రాష్ట్రం విద్యాభివృద్ధిలో నెంబర్ వన్ స్థాయికి ఎదిగే విధంగా రాష్ట్రాన్ని విద్యా హబ్‌గా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం జరిగిందని, విద్యార్థులు బాగా చదివి తమ ప్రాంతానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్డీవో శ్రీనివాస్, డీఆర్‌వో సుబ్రమణ్యం, ఓపెన్ స్కూల్స్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, మండల మాజీ ఉపాధ్యక్షులు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు అబ్బవరం హరిబాబు, టీడీపీ నాయకులు గండికోట సుధాకర్, శివారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూ, ముస్లింలు
సోదరభావంతో మెలగాలి

6

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- గొడవలు జరిగితే కఠిన చర్యలు : ఎస్పీ

విద్యార్థికి ఉపాధ్యాయుడే రోల్‌మోడల్

- తల్లిదండ్రుల పాత్రా కీలకమే
- కేంద్రం నిధులతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్



కడపలో జరిగిన మెగా పీటీఎంలో ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయుడే రోల్ మోడల్ అని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. శనివారం కడప నగరపాలక ఉన్నత పాఠశాల (మెయిన్)లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రితో పాటు కలెక్టరు డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్, రాష్ట్ర పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనరు క్రిష్ణతేజ, ఇన్‌చార్జ్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, కడప ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ మాధవి, ప్రొద్దుటూరు, కమలాపురం ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, క్రిష్ణచైతన్యరెడ్డిలు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమన్నారు. పిల్లలు ఎవరిని చూస్తూ పెరుగుతారో వారిలాగానే మారుతారని, ముఖ్యంగా సోషల్ మీడియాకు బానిసైతే జీవితాలు నాశనం అవుతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం మౌలిక వసతులే కాకుండా విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను, సత్ప్రవర్తనను నేర్పించే ప్రధాన ఉద్దేశ్యంతో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. అందుకోసం పాఠశాల నిర్వహణ కమిటీలను పటిష్టంగా నిర్వహిస్తూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సమన్వయం చేస్తూ పేరెంట్స్, టీచరు సమావేశాలను అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తున్నారన్నారు. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి ఆదర్శవంతంగా ముందుకు వెళ్లాలన్నారు. పాఠశాలలకు సంబంధించి ఏ అభివృద్ధి కార్యక్రమమైనా పేరెంట్స్ కమిటీల ద్వారానే నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కవులు, సాహిత్యవేత్తలకు పుట్టినిల్లు

ఎందరో విద్యావేత్తలు, కవులు, సాహిత్యవేత్తలకు పుట్టినిల్లు కడప జిల్లా అని పవన్‌కళ్యాణ్ కొనియాడారు. ఈ ప్రాంతంలో అత్యధిక లైబ్రరీలు ఉన్నాయని, పుస్తకనిధి అధికంగా ఉండడంతో ఇక్కడ ప్రజల్లో విజ్ఞాన సంపద కూడా అధికంగా ఉంటుందనే భావనను వ్యక్తం చేశారు. కడప నీటి సమస్యను తీర్చి ఇక్కడ ప్రజలను ఆదుకుంటామన్నారు. రాయలసీమ అంటేనే చదువుల నేల అని, ఇలాంటి ప్రాంతానికి రావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సీమ అంటే అభివృద్ధికి వెనుకబాటు కాదని, అవకాశాలు అందించే వనరుల నిధి అన్నారు.

పాఠశాల అభివృద్ధికి సొంత నిధులు

కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్ పాఠశాల అభివృద్ధి పనుల కోసం నిధులను తన సొంత ట్రస్టు నుంచి అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ పాఠశాలల్లో ఎలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు జరిగినా అందుకు బహుమతులు, జ్ఞాపికలు ఖర్చులు కూడా తానే స్వయంగా భరిస్తానన్నారు. దూరంగా ఉండే పాఠశాలలకు ప్రత్యేకంగా విద్యార్థుల కోసం బస్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. దేశ భద్రత కోసం ప్రాణాలర్పించిన అమరువీరులను, ప్రతిరోజూ మన పరిసరాలను శుభ్రపరిచే పారిశుధ్య కార్మికుల రుణం తీర్చుకోలేనిదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల ద్వారా విద్యార్థుల సంఖ్య క్రమేపీ పెరుగుతుందన్నారు. ఆ దిశగా విద్యాశాఖ పనిచేస్తుందన్నారు. మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో ఏర్పాటు చేసిన పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో భాగంగా విద్యార్థులతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కాసేపు ముచ్చటించారు. ప్రతి బెంచ్ వద్దకు వెళ్లి విద్యార్థులను ఆప్యాయంగా పేర్లు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కరచాలనం చేశారు. విద్యార్థులతో కలిసి పవన్‌కళ్యాణ్ సహపంక్తి భోజనం చేశారు.

ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కడప ఎయిర్‌పోర్టుకు ఉదయం 11 గంటలకు చేరుకోగానే కలెక్టరుతో పాటు ఎమ్మెల్యేలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం 11:07 గంటలకు విమానాశ్రయం నుంచి బయలుదేరి 12 గంటలకు మున్సిపల్ హైస్కూల్‌కు చేరుకున్నారు. 2:30 గంటల వరకు హైస్కూల్‌లో ఉండి 2:46 గంటలకు కడప విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి విజయవాడకు బయలుదేరి వెళ్లారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే


కలెక్టరేట్ ముఖ ద్వారం ఎదుట..


జాయింట్ కలెక్టర్ పేషీ దగ్గర..

నిఘా నీడలో కలెక్టరేట్

● ప్రతి సెక్షన్‌లోనూ సీసీ కెమెరాలు ● సిబ్బందిపై నిఘా

● ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్న జేసీ

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో రెండు రోజుల క్రితం 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పటిష్టం చేశారు. కలెక్టరేట్‌కు వచ్చేవారు పోయే వారిపై కూడా నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. కలెక్టరేట్‌లోని ప్రతి సెక్షన్‌లో రెండు సీసీ కెమెరాలు ఏర్పా టు చేసి సిబ్బందిపై మరింత నిఘా పెట్టారు. ప్రతిరోజూ కలెక్టరేట్ సి బ్బంది ఎన్ని గంటలకు వస్తున్నారు. ఎన్ని గంటలకు వెళుతున్నారు అన్న విషయాలపై జాయింట్ కలెక్టర్ పూర్తిగా ఆరా తీసే పనిలో ఉన్న ట్లు తెలుస్తోంది. అసలు కలెక్టరేట్‌లో 12 కెమెరాలు ఎందుకు పెట్టాల్సి వచ్చింది. అంటే సిబ్బంది వస్తున్నారా లేదా వచ్చిన తర్వాత ఏం చేస్తున్నారు అన్న విషయాలపై జాయింట్ కలెక్టర్ ప్రతిరోజూ పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలుస్తోంది. కలెక్టరేట్‌లోని కొంతమంది సిబ్బంది సమయానికి రాకుండా ఏదో ఒక సాకు చెప్పి గంటల తరబడి ఫోన్‌లో మాట్లాడుతున్నారని, అటువంటి వారి వల్ల కలెక్టరేట్‌కు చెడ్డపేరు వస్తోందన్న ఉద్దేశ్యంతో ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు కొంత మంది అధికారులు చెప్పుకొస్తున్నారు. ఈ విషయంపై కలెక్టరేట్ ఏవో నాగభూషణంను వివరణ కోరగా కలెక్టరేట్ సిబ్బంది సమయానికి రాకపోవడం వల్లనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంకా కొన్ని రోజుల తర్వాత ప్రతి ఒక ఉద్యోగి ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.


కో-ఆర్డినేషన్ సెక్షన్‌లో..

నాగన్న స్టేజి ఎక్కితే.. అవార్డుల పంటే

● పౌరాణిక, జానపదంలో ఆయన నటన అద్భుతం

● ఐదువేల ప్రదర్శనలతో నేటికీ కళామతల్లి సేవలోనే

చెన్నూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆయన పుట్టిందో పల్లెటూరు.. వృత్తిరీత్యా బ్యాంకు ఉద్యోగి. ప్రవృత్తి కళాకారుడు. నటనలో మేటిగా రాణిస్తున్న ఆయన స్టేజీ ఎక్కాడంటే అవార్డు ఆయన వద్దకు రావాల్సిందే. ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకుని 50 ఏళ్లకు పైగా నాటకంలో రాణిస్తూ అద్భుతం అనిపించుకున్న ఆ కళాకారుడే చెన్నూరుకు చెందిన సురతాని నాగన్న. జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు లెక్కలేనన్ని అవార్డులు అందుకున్న నాటక బ్రహ్మ. చెన్నూరు స్టేట్ బ్యాంకులో అసిస్టెంటు మేనేజరుగా పని చేసి పదవీ విరమణ పొందారు. ఆయన స్వగ్రామం చక్రాయపేట మండలం నెరసుపల్లె. 1954లో జన్మించారు. 1972లో 9వ తరగతి చదివే సమయంలో చిన్నపాటి వేషధారణలతో నటనపై మక్కువతో అడుగు పెట్టి 50 ఏళ్లుగా నాటకాల్లో వైవిధ్యభరితమైన పాత్రల్లో రాణించాడు.

5 వేలకు పైగా నాటకాలు

ఐదువేలకు పైగా నాటకాల్లో పాల్గొన్న ఆయన 200కు పైగా వివిధ రకాల వేషాలతో కళలు ప్రదర్శించారు. 150 ఏకపాత్రాభినయాలతో ప్రముఖుల మన్ననలు అందుకున్నారు. 50 మార్లు దశరథుడి పాత్రలో ఇమిడి తన అద్భుత నటనా కౌశల్యంతో ఆకట్టుకున్నాడు. 1984లో సవేరా ఆర్ట్స్ గ్రూపులో సభ్యుడిగా చేరి ఆ సంస్థకు 12 మార్లు నంది అవార్డు వచ్చేందుకు కృషి చేశారు. జనకుడు, గౌతముడు, బ్రహ్మ, రావణుడు, రావణబ్రహ్మ, మాయారావణుడు, విభీషణుడు, వెంకటేశ్వరుడు, మారీచుడు, యముడు, మారుతి, తాంద్రపాపారాయుడు, శకుని, అర్జునుడు, శ్రీనాథ కవి, హరిశ్చంద్ర ఇలా ఎన్నో వైవిధ్యమైన పౌరాణిక జానపద పాత్రల్లో అద్భుతంగా నటించారు. స్టేజీపై నిలిచాడంటే తన పాత్రలో ఒదిగిపోయి ప్రేక్షకుల చేత తప్పట్లు, ప్రముఖుల చేత శాలువాలు కప్పించుకోవడం సాధారణమైంది. ఏ పాత్ర వేసినా తనకు తానే సాటి అనిపించుకున్నాడు. ఆ పాత్రను చూసిన ప్రేక్షకుడు ఈ పాత్ర నాగన్న మాత్రమే చేయగలడనే విధంగా అనిపించుకున్నాడు.

ఆరు రాష్ట్రాల్లో అలరించిన కళాకారుడు

ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా ఈ ఐదు రాష్ట్రాల్లో కళాకారుడుగా వివిధ రకాల పాత్రలతో నాగన్న అలరించాడు. వెంకటేశ్వర వైభవం, శ్రీరామవనవాసం, పాదుకా పట్టాభిషేకం, వాసవీ కన్యక, భక్త మారుతి, సతీ అహల్య, శ్రీరామ పాదుకలు, సత్యహరిశ్చంద్ర (కాటిఘట్టం) శ్రీనాథ కవిసార్వభౌమ, పద్మావతి వైభవం లాంటి గొప్ప నాటికల్లో ప్రధాన పాత్రలతో అలరించారు. ప్రతి పాత్రను అలవోకగా పండిస్తూ స్టేజీపై తాను వేసిన పాత్రలో ప్రేక్షకులు గుర్తించుకునేలా ప్రదర్శించారు. దీంతో ఆరు రాష్ట్రాల్లో స్టేజీలపై ప్రదర్శించిన ప్రతి పాత్రకు అక్కడి ప్రజలు జేజేలు కొట్టారు. అభినందనలు తెలిపారు.

ప్రముఖులతో ప్రశంసలు

హైదరాబాదులో జరిగిన తెలుగు ఆత్మగౌరవ దినోత్సవంలో నందినాటక ఉత్సవాల్లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. 2005లో తిరుపతిలో జరిగిన జాతీయ స్వర్ణోత్సవాల్లో భక్తమారుతి పాత్రను ప్రదర్శించినప్పుడు అప్పటి ఉమ్మడి రాష్ట్ర స్పీకరు కిరణ్‌కుమార్‌రెడ్డి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి దాసరి నారాయణరావు చేతుల మీదుగా ప్రశంసలు, నేషనల్ అవార్డులు అందుకున్నారు. అలాగే 1994లో ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రముఖులచే సత్కారాలు అందుకున్నారు. 2002లో కడపలో సౌజన్య కళామండలిచే కడప రత్న అవార్డు, 2004లో అప్పటి కలెక్టరు జయేశ్‌రంజన్ చేతుల మీదుగా కడప ప్రతిభా అవార్డు, 2012లో ప్రొద్దుటూరులో జరిగిన స్వామిక్రియేషన్స్ వారితో రాయలసీమ కళారత్న అవార్డు, 2014లో బళ్లారిలో జరిగిన నాటకోత్సవంలో బళ్లారి రాఘవ అవార్డును, 2015లో అప్పటి సుప్రీంకోర్టు జడ్జి శేషసాయి చేతుల మీదుగా పౌరాణిక నటబ్రహ్మ అవార్డులు అందుకున్నారు. అలాగే అదే ఏడాది విజయవాడ మానస సాహిత్య సాంస్కృతిక అకాడమీలో అక్కినేని పురస్కారం కూడా అందుకున్నాడు. 2021లో నటకళారత్నగా 2022లో జిల్లా కలెక్టరు విజయరామరాజు చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. 2024 ఆగష్టు 9న ఎర్రగుంట్లలో ప్రముఖుల చేతులో రజత హస్త కంకణాన్ని, సత్కారాన్ని అందుకున్నాడు. ఇవే కాక నాటి మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, గవర్నరు వెంకటసుబ్బయ్య, కొప్పర్తి సుబ్బారావు వంటి ప్రముఖుల ద్వారా ప్రశంసలు అందుకున్నాడు.

ఎస్‌బీఐలో నాలుగు సార్లు అవార్డులు

చెన్నూరు స్టేట్‌బ్యాంకులో అసిస్టెంటు మేనేజరుగా పనిచేసిన ఆయన తన 25 ఏళ్ల సర్వీసును చెన్నూరు ఎస్‌బీఐలోనే గడిపారు. గురువు ఆళ్లగడ్డ శ్రీనివాసులు (ఆయన ఘంటసాల జతలో అలరించారు) ఆధ్వర్యంలో నటనలో తీర్చిదిద్దబడ్డ నాగన్న హైదరాబాదులో ఎస్‌బీఐ ఎండీ చేతుల మీదుగా 1986, 2009లో ఘన సన్మానాలు అందుకున్నారు. నేటికీ కళామతల్లి ముద్దుబిడ్డగానే రాణిస్తూ ఊపిరి ఉన్నంత వరకు కళామతల్లి సేవ చేస్తూనే ఉంటానన్నారు. వృత్తిలో ఎంత ఒత్తిడిలో ఉన్నా నాటకరంగాన్ని అలవోకగా పండించడం, ఐదువేలకు పైగా నాటకాల్లో పాల్గొనడం ఆయన కళాతృష్ణకు నిదర్శనం. అలాంటి వ్యక్తి చెన్నూరులో ఉండడం గర్వకారణమని స్థానికులు చెబుతుంటారు.


అవార్డులతో నాగన్న

కళామతల్లే నా ప్రాణం



ఊపిరి ఉన్నంత వరకు కళామతల్లికి సేవ చేస్తునే ఉంటా. 70 ఏళ్ల వయసులో ఎవరు ఏ నాటక విషయంలో ఎక్కడికి పిలిచినా వెళుతునే ఉన్నా. బ్యాంకు ఉద్యోగిగా సర్వీసులో ఎంత సేవ చేసినా కళామతల్లి సేవలో ఉన్న ఆనందం మరేదాంట్లోనూ నాకు లేదనిపిస్తుంది. అందుకే ఆ తల్లికి నేను ఎప్పటికీ చిన్నబిడ్డనే. నా శ్వాస, ధ్యాస అంతా కళామతల్లి వద్దనే. ఊపిరి ఉన్నంత వరకు కళాకారుడిగానే జీవిస్తా.

-నాగన్న, కళాకారుడు, చెన్నూరు







నాటి సీఎం చంద్రబాబు, అప్పటి స్పీకరుగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి, అప్పటి కడప కలెక్టరు శశిభూషణ్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న నాగన్న

మధ్యవర్తిత్వంతో సంబంధాలను పునరుద్ధరించవచ్చు

● కడప ప్రత్యేక న్యాయమూర్తి హేమస్రవంతి జానకీరాం

రైల్వేకోడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో విచ్ఛిన్నమైన సంబంధాలను పునరుద్ధరించవచ్చని కడప ప్రత్యేక న్యాయమూర్తి హేమస్రవంతి జానకీరాం తెలిపారు. శనివారం రైల్వేకోడూరు న్యాయస్థానం ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయవాదులకు ఒక్క రోజు పాటు మధ్యవర్తిత్వం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక కేసుకు సంబంధించి ఏ దశలోనైనా న్యాయవాదులు మధ్యవర్తిత్వం ప్రారంభించవచ్చని తెలిపారు. మధ్యవర్తిత్వం వలన ఇరు పార్టీలకు సయోధ్య ఏర్పడుతుందన్నారు. భార్య భర్తల కేసులు, ప్రామిసరీనోటు (చెక్‌బౌన్స్ కేసు) వంటి కేసులను సామరస్యంగా పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. వారి మధ్య విద్వేషాలను తొలగించి, ఇరువురు స్నేహ పూర్వకంగా మసలుకోవడానికి న్యాయవాదులు సహాయపడాలని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారావు, సీనియర్ న్యాయవాదులు వెంకట్రామరాజు, రెడ్డయ్యనాయుడు, మధుసూదన్‌రావు, సురేష్‌రెడ్డి, చెంచురామయ్య, శంకరయ్యనాయుడు, మహిళా న్యాయవాది అంబికా తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి హేమస్రవంతి జానకీరాం

హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

● గొడవలు జరిగితే కఠిన చర్యలు : ఎస్పీ


రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలిగి ఎటువంటి గొడవలకు చోటు ఇవ్వరాదని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రితో పాటు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్‌ల ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న గొడవలను దృష్టిలో ఉంచుకుని హిందూ, ముస్లింలతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఎటువంటి గొడవలకు తావివ్వకుండా హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో ఎటువంటి గొడవలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో కొంతమంది ఆకతాయిలు గొడవలు సృష్టిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని, రాత్రి 10.30 గంటల తర్వాత అత్యవసర పరిస్థితుల్లో తప్ప అనవసరంగా ఎవరూ బయట తిరగకూడదన్నారు. రాయచోటి పట్టణం ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా పెడతామన్నారు. పట్టణంలో ఎటువంటి చిన్న సమస్య కూడా తలెత్తకుండా ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ పుల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అవాస్తవాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు


రాయచోటిటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదాన్ని కొందరు ఆకతాయిలు అసత్య ప్రచారాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇప్పటికే 150 మంది అసాంఘిక శక్తులను డ్రోన్ టెక్నాలజీ, ఇతర అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించామన్నారు. వీరిపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించినట్లు ఎస్పీ తెలిపారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా దుష్ప్రచారం చేసే సంఘవిద్రోహ శక్తులు, ప్రజలను రెచ్చగొట్టే వారిపై నిఘా ఉంచామని తెలిపారు.



గల..గల..పారుతూ..

ఇటీవల కురిసిన వర్షాలకు నదులు, చెరువుల అలుగులు గలగలా పారుతున్నాయి. ఆయా ప్రాంతాలు పచ్చని చెట్లతో కనువిందు చేస్తున్నాయి. పక్షుల కిలకిలలు, అలుగుల వద్ద చిన్నపిల్లల కేరింతలు, కొత్త నీరు వచ్చిన చేప పిల్లల పులకరింతలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. సాయంత్రమైతే మరింత ఆహ్లాదకరంగా వాతావరణం ఉంటోంది. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని చిట్వేలి మండలం యల్లంరాజుచెరువు, చెక్‌డ్యాంలు, చిట్వేలి-రాపూరు మార్గం మధ్య నేల, నీరు, ఆకాశం కనిపించే అందాలు చూడవచ్చు.

- రైల్వేకోడూరు (ఆంధ్రజ్యోతి)



చదువులమ్మ ఒడి.. ప్రభుత్వ బడి

● ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థుల ప్రతిభ

● అడ్మిషన్లూ 1500 పైనే

● మార్కుల్లో ప్రతి ఏటా టాపే

బద్వేలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేలకు వేలు ఫీజులు చెల్లిస్తే తమ పిల్లలకు మంచి విద్య అందుతుందని తల్లిదండ్రులు భావిస్తుంటారు. కొంతమంది స్తోమత లేకపోయినా తమ పిల్లలకు మంచి విద్య అందించాలనే తాపత్రయంతో ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తుంటారు. కానీ ప్రైవేటుకు ఏమాత్రం తీసిపోని విధంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పేరు తెచ్చుకుంటోంది. మంచి విద్యనందిస్తూ చదువులమ్మ ఒడిగా ప్రశంసలు పొందుతోంది. ఇక్కడి విద్యార్థులు గత ఐదేళ్లుగా పదవ తరగతి ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలతో పోటీపడి మంచి మార్కులు సాధిస్తున్నారు. దీంతో పట్టణంలో బెస్ట్ పాఠశాలగా పేరు గాంచింది. 1918లో ప్రారంభమైన ఈ పాఠశాల.. ప్రత్యేక తరగతులు, అత్యుత్తమ శ్రద్ధ, ఉత్తమ బోధనతో విద్యను అందిస్తోంది. అటు చదువులోనూ, ఇటు ఆటల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను కనబరుస్తున్నారు.



విద్యార్థుల సంఖ్యలోనూ టాప్

కొన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ ఎక్కువమంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళుతుంటారు. కానీ బద్వేలు పట్టణంలోని కన్యకా పరమేశ్వరి బాలుర ఉన్నత పాఠశాలలో మాత్రం ఇందుకు భిన్నంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. గత నాలుగేళ్ల క్రితం నుంచి అడ్మిషన్ల సంఖ్య జోరందుకుంటోంది. ప్రస్తుతం 1630 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

చదువుతో పాటు, ఆటల పోటీల్లోనూ

పది ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలు తమ విద్యార్థులు టాప్‌లో నిలిచారంటూ ఊదరగొడుతుంటారు. బద్వేలు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు కూడా వారితో పోటీపడుతున్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో 586 మార్కులు సాధించారు. 50 మందికి పైగా 500 పైబడి సాధించి జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన పాఠశాలగా పేరొచ్చింది. గత నాలుగేళ్ల నుంచి ప్రతి ఏడాది పదిలో మంచి మార్కులు సాధిస్తున్నారు. చదువులోనే కాకుండా ఆటల పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి వాలీబాల్, ఖోఖోలో విద్యార్థులు అనేక బహుమతులు సాధించారు.


ఆటల పోటీలలో మెడల్స్ సాధించిన విద్యార్థులు (ఫైల్)

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. ఇక పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఉదయం 8 గంటలకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నాం. ఈసారి కూడా మంచి మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నాం.

- జి.వెంకటసుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, బద్వేలు


వాలీబాల్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు (ఫైల్)

ప్రభుత్వాస్పత్రి వద్ద ఘర్షణ

● ఇన్‌స్టాగ్రాం పరిచయం తెచ్చిన తంటా... కొట్టుకున్న ఇరువర్గాలు

మదనపల్లెఅర్బన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రాంలో పరిచయంతో తన భార్యకు ఓ యువకుడు ఫోన్‌లు చేస్తున్నాడని ఆగ్రహించి ఆ మహిళ భర్త ఆ యువకుడిపై దాడి చేసి కొట్టాడు. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లెకు చెందిన ఓ యువకుడు (21)కి ఇన్‌స్టాగ్రాంలో మదనపల్లెకు చెందిన ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. దీంతో వారిద్దరూ మెసేజ్‌లు పెట్టుకోవడంతో పాటు ఫోన్‌లో కూడా మాట్లాడుకుంటుండేవారు. ఈ విషయం ఆమె భర్తకు తెలియడంతో అతను ఆమెను వారించాడు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం మదనపల్లె ప్రభుత్వాస్పత్రి వద్ద ఆ మహిళతో ఆ యువకుడు మాట్లాడుతుండగా అక్కడికి వచ్చిన ఆ మహిళ భర్త వారిద్దరిని చూసి ఆగ్రహంతో ఆ యువకుడిపై దాడి చేశాడు. దీంతో వారిద్దరూ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఆ యువకుడు గాయపడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది.


జిల్లా ఆస్పత్రి వద్ద గొడవ పడుతున్న ఇరువర్గాలు

వామ్మో..వరికోతలు



- వరికోత యంత్రాల యజమానులు సిండికేట్
- తమిళనాడు హార్వెస్టర్లు రాకుండా అడ్డగింపు
- గంటకు రూ.3500 చార్జీలు ● కూలీల కొరతతో ఇక్కట్లు
- గత్యంతరం లేక హార్వెస్టర్లను ఆశ్రయిస్తున్న రైతులు
- కుదేలవుతున్న అన్నదాతలు

కడప రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరికోతలు రైతులకు భారంగా మారాయి. కూలీలంతా ఉపాధిహామీ పథకం పనుల వైపు మొగ్గు చూపుతుండడంతో కోతలకు కూలీల కొరత అడ్డంకిగా మారింది. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు వరికోత యంత్రాల(హార్వెస్టర్ల)ను ఆశ్రయిస్తున్నారు. దీంతో హార్వెస్టర్లకు రైతుల నుంచి డిమాండ్ అధికంగా ఉండడంతో యజమానులు సిండికేట్ అయ్యారు. అమాంతంగా ధరలను పెంచేశారు. చైన్ హార్వెస్టర్‌కు గంటకు రూ.3500లు, టైర్ల హార్వెస్టర్‌కు రూ.2500 పైబడి తీసుకుంటున్నారు. ఒక ఎకరా వరికోతకు రెండు గంటల సమయం పడుతుండడంతో రైతు దాదాపు రూ.7000లు చెల్లించాల్సి వస్తోంది. ఇది రైతుకు అదనపు భారం అవుతోంది. గత ఏడాది గంటకు చైన్ హార్వెస్టర్‌కు 2800 నుంచి రూ.3000లు, టైర్ల హార్వెస్టర్‌కు అయితే 1800 నుంచి 2000ల వరకు చార్జీలు ఉండేవి. అయితే ఈ ఏడాది ఉన్నపలంగా హార్వెస్టర్ల యజమానులు ధరలను పెంచేశారు. కారణం గతంలో వరికోత సీజన్‌లో తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాల నుంచి వరికోతయంత్రాలు వచ్చేవి. ఇవి మన జిల్లాలోని హార్వెస్టర్ల ధరల కన్నా రూ.300 నుంచి 500 వరకు తక్కువ ధరతో వరికోతలను కోసేవారు. అయితే ప్రస్తుత సీజన్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న హార్వెస్టర్లను ఇక్కడి హార్వెస్టర్ల యజమానులు రాకుండా చేసి... సిండికేట్‌గా మారి అధిక ధరలను నిర్ణయించారు. దీంతో రై చేసేదిలేక అధిక ధరలను చెల్లించి వరి కోతలను కొనసాగిస్తున్నారు.

ముమ్మరంగా వరికోతలు

జిల్లాలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. 2024 ఖరీఫ్‌లో జిల్లాలో కేసీ కెనాల్ ఆయకట్టుతో పాటు, బోరు బావులు, నదీ పరివాహక ప్రాంతాలతో పాటు ఇతర నీటి వనరుల కింద 28వేల హెక్టార్లకు పైగా రైతులు వరి పంటను సాగుచేశారు. ఇప్పటికి దాదాపు 12వేల హెక్టర్ల వరకు వరికోతలు జరిగాయి. ఇంకా 14వేల హెక్టార్లు పైబడి వరికోతలు జరగాల్సి ఉంది. ఇందులో బోరుబావులు, ఇతర నీటి వనరుల కింద సాగుచేసిన వరికోతలు నవంబర్ మధ్యస్థం నుంచి ప్రారంభమయ్యాయి. కేసీ కెనాల్ ఆయకట్టు కింద కాస్త ఆలస్యంగా వరి పంట సాగుచేయడంతో డిసెంబర్ మధ్యస్థం నుంచి జనవరి వరకు కోతలు కొనసాగనున్నాయి. ప్రస్తుతం 40 శాతం వరకు వరికోతలు పూర్తయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో సాగుతున్నాయి. జిల్లాలో హార్వెస్టర్ల సంఖ్య తక్కువగా ఉండడంతో అదే అదనుగా భావించిన కొందరు యజమానులు చార్జీలు అమాంతం పెంచారు. గత ఏడాది టైర్ల హార్వెస్టర్‌కు గంటకు రూ.1600 నుంచి 1800ల వరకు వసూలు చేయగా ప్రస్తుతం రూ.2,000 నుంచి రూ.2500 వరకు డిమాండ్ చేస్తున్నారు. దీనికితోడు ఫెంగల్ తుపాను ప్రభావం కొనసాగుతుండడంతో రైతులు వర్షం నుంచి పంటను కాపాడుకోవడానికి తాపత్రయ పడుతున్నారు. ఈ అవకాశాన్ని చైన్ హార్వెస్టర్లు ఆసరాగా చేసుకుని అందినకాడికి దండుకుంటున్నారు. ఒక గంటలకు రూ.3500 వరకు వసూలు చేస్తున్నారు. అయినా గత్యంతరం లేక హార్వెస్టర్‌తో కోయిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యయం పెరిగింది



వరి సాగుకు ఏటేటా వ్యయం పెరుగుతోంది. నేను 1.50 ఎకరాలలో వరిపంట సాగుచేశాను. తుఫాన్ ప్రభావంతో పంట దెబ్బతింటుందని 4 రోజుల క్రితమే చైన్ హార్వెస్టర్‌తో వరి పంటను కోయించాను. గత ఏడాది గంటకు చైన్ హార్వెస్టర్ అద్దె 2800 నుంచి రూ.3000లు ఉండగా ఇప్పుడు అదనంగా రూ.500లు పెంచారు. అయినా తప్పడం లేదు.

- అనగూరి హరినాథరెడ్డి, పొలుగారిపల్లె, సీకేదిన్నె మండలం

స్థానికంగా యంత్రాలు లేక...



వరి కోతలు ఒక్కసారిగా వచ్చాయి. కూలీల కొరత ఎక్కువగా ఉంది. వరికోత యంత్రాలకు డిమాండ్ ఎక్కువైంది. పండిన పంటను ఏదోక విధంగా కోత కోయించి సొమ్ము చేసుకునేందుకు వరికోత యంత్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ యంత్రాలు స్థానికంగా లేకపోవడంతో దూరప్రాంతాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తోంది. దీంతో వారు అడిగినంత చార్జీలు చెల్లించక తప్పడం లేదు.

- మునెయ్య, వెంకటగారిపల్లె, సీకే దిన్నె మండలం

కూలీలు దొరకడం లేదు



నేను రెండున్నర ఎకరాలలో వరి పంటను సాగుచేశాను. ఒక పక్క వరి కోతలకు కూలీలు దొరకడం లేదు. ఇప్పుడేమో వర్షం పట్టుకుంది. బాడుగలు ఎక్కువ చెబుతున్నా చైన్ హార్వెస్టర్‌తో కోతలు కోయించుకుంటున్నాం. ఒక ఎకరా వరికోతకు రూ.3500లు చెల్లించాను. ఇలా దాదాపు ఐదు గంటలు పైనే సమయం పట్టడంతో రూ.10వేలు వరకు చెల్లించాల్సి వచ్చింది.

- ఎ.రవిశంకర్‌రెడ్డి, పొలుగారిపల్లె, సీకేదిన్నె మండలం

రౌడీషీటర్ పప్పీ హత్య కేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భక్తవత్సలం

ప్రొద్దుటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలు మనసులో పెట్టుకుని పప్పీ అలియాస్ కొప్పుల రాఘవేంద్రను ఎనమల లోకేష్‌రెడ్డి మరో ఇద్దరు కలిసి హత్య చేసినట్లు డీఎస్పీ భక్తవత్సలం వెల్లడించారు. స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఆవరణలో శనివారం హత్యకేసుకు సం బంధించి వివరాలు తెలిపారు. లోకేష్‌రెడ్డికి పప్పీకి మధ్య స్నేహంతో పాటు మనస్పర్థలు ఉండేవి. ఈ నేపథ్యంలో డిసెంబరు 1న ఆదివారం లోకేష్‌రెడ్డికి పప్పీ ఫోన్ చేసి డబ్బులు అడిగాడు. డబ్బులు లేవు కావాలంటే బీజీఆర్ లాడ్జికి వస్తే మందు పార్టీ ఇస్తానని లోకేష్ రెడ్డి ఆఫర్ చేశాడు. ఆదివారం రాత్రి బీజీఆర్ లాడ్జీకి పప్పీ వెళ్లగా.. అప్పటికే లాడ్జీలోని రూములో లోకేష్‌తో కలిసి సునీల్‌రెడ్డి, ముజీబ్‌లు మందు తాగుతూ వున్నారు. పప్పి వచ్చిన తర్వాత అందరూ కలిసి మందు తాగుతుండగా మాటామాటా పెరిగి నీవెంత అంటే నీవెంత అంటూ బీరాలకు పోయి ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో పప్పీ రెచ్చిపోయి వారి మీద దాడి చేయడంతో ఆ ముగ్గురు కలిసి పప్పీని మందుబాటిల్‌తో తలపై కొట్టారు. దీంతో పప్పీ స్పృహతప్పి కింద పడిపోయాడు. దాడి తర్వాత పప్పీ బతికితే మళ్లీ తమ ప్రాణాలకు ఎక్కడ ముప్పు ఉం టుందోనని పప్పీ కాళ్లను అదిమిపట్టి గొంతునులిమి చంపినట్లు నింది తులు విచారణలో వెల్లడించారని డీఎస్పీ తెలిపారు. కాగా, నిం దితులు ముగ్గురు ఆర్టీపీపీ రోడ్డులో ఉండగా వన్‌టౌన్ సీఐ రామ క్రిష్ణారెడ్డి, ఎస్‌ఐ సంజీవరెడ్డిలు అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

మంగంపేటలో దారుణ హత్య



ఓబులవారిపల్లె, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): మంగంపేట గ్రామంలో గుట్ట ఆంజనేయులు(55) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి దారుణ హత్యకు గుర య్యారు. గ్రామస్థుల వివరాల మేర కు.. మృతుడు ఆంజనేయులు వికలాంగుడు కాగా ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు రమణ, వెంకటేశ్, కుమార్తె సుభాషిణి ఉన్నారు. పెద్ద కుమారుడుకి పెళ్లి అయ్యింది. శుక్రవారం రాత్రి నిద్రిస్తున్న అతని తలపై పదునైన ఆయుధంతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేయగా రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె ఎస్‌ఐ మహేష్‌లు సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించి.. అనుమానాస్పదంగా ఉండడంతో కేసు నమోదు చేసి పలు కోణాల్లో దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తొమ్మిది మందిపై కేసులు నమోదు

చాపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రిపల్లెలో జరిగిన ఘర్షణకు సంబంధించి శనివారం తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి వద్ద ఆటో నిలిపే విషయమై శుక్రవారం భద్రిపల్లె గ్రామానికి చెందిన బండి రమేష్, మోకాటి ఓబులేసులు ఘర్షణకు పాల్ప డ్డారు. దీంతో ఇరువర్గాల వారు ఒకరిపై మరొకరు కట్టెలు, రోకలి బడెలతో దాడులకు పాల్పడ్డారు. దీంతో ఓబులేసు, ఓబన్న, వెలుగమ్మ, రమేష్, సూర్యం, శ్యామల, అనూరాధలకు గాయాలయ్యాయి. ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై కేసులు నమోదు చేశామన్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు... ఇద్దరికి తీవ్రగాయాలు





ప్రమాదంలో గాయపడిన నారాయణరెడ్డి, రామసుబ్బమ్మ

కాశినాయన డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం వద్ద ప్రదాన రహదారిపై శనివారం స్కూటర్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వివరాల మేరకు... లింగారెడ్డిపల్లెకు చెందిన అంబవరం నారాయణరెడ్డి, కొత్తపల్లె రామసుబ్బమ్మలు స్కూటర్‌పై ఉప్పలూరు గ్రామానికి వెళుతుండగా... అదే సమయంలో పోరుమామిళ్ల నుంచి కలసపాడు వస్తున్న కారు ఓబుళాపురం గ్రామసమీపంలో స్కూటర్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో రామసుబ్బమ్మ, నారాయణరెడ్డిలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గుర్తించి స్థానికులు 108కు సమచారం అందించి పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.

కారు, ఆటో ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడ్డ మునెమ్మ

ముద్దనూరు డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి పులివెందుల రహదారిలోని పుల్లేరు వంక సమీపంలో శనివారం రాత్రి కారు ఆటో ఢీకొన్న సంఘటనంలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి.స్థానికుల సమాచారం మేరకు వివరాలు... కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన అగ్గిరాజు(60),మునెమ్మ(55)లు ఆటో వెళ్ళి ఫ్యాన్సీ సామానులు వ్యాపారం చేస్తుంటారు. పులివెందుల వైపు నుంచి ఆటో లో వస్తున్నారు. జమ్మలమడుగు నుంచి ధర్మవరంకు కారు వెళుతుంది.పుల్లేరు వంక సమీపంలో రోడ్డుకు ఏర్పడ్డ పెద్ద గుంత వద్దకు రాగానే గుంతను తప్పించబోయి కారు ఆటో ఢీకొన్నాయి.దీంతో ఆటోలో ఉన్న అగ్గిరాజు, మున్నెమ్మకు గాయాలయ్యాయి. ఆటో బోల్తాపడగా, కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యాను ఢీకొనడంతో ఒకరికి..



గాయపడ్డ వ్యక్తి రఘురామయ్య

పోరుమామిళ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల సమీపంలోని మల్లక తవ వద్ద మినీ లగేజీ వ్యాను స్కూటరును ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గోపవరం మండలం లెక్కలూరి గ్రామానికి చెందిన గాలి రఘురామయ్య కాశినాయన మండలంలో ఉన్న తన కూతురు వద్దకు వెళుతుండగా మల్లకతవ మలుపులో వ్యాను అదుపు తప్పి స్కూటరును ఢీకొంది. సమాచారం తెలిసిన ఎస్‌ఐ కొండారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వ్యక్తిని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గోపరాజుపల్లెలో ఘర్షణ... ఒకరికి గాయాలు



పెండ్లిమర్రి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపరాజుపల్లెలో శని వారం ఇరువర్గాల వారు ఘర్షణ పడటంతో నంద్యాల సుబ్బరాయుడు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు జరిగాయి. ఈ నేపథ్యంలో పాతకక్షల కారణంగా ఇరువర్గాల వారు ఆధిపత్యం కోసం ఈ ఘర్షణకు పాల్పడినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

వేముల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేముల ప్రధాన రహదారిపై స్థానిక వెంకటేశ్వరస్వామి గుడి వద్ద ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తొండూరు మండలం మడూరు గ్రామానికి చెందిన మిద్దె విశ్వనాథ్ తన బంధువుల గ్రామమైన గొందిపల్లెకు పులివెందుల నుంచి బైకుపై వస్తుండగా వేములలో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

టీచర్ ఎజాజ్ కుటుంబానికి న్యాయం చేయాలి

- ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు

కడప కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి ఉర్దూ హైస్కూలులో ఫిజికల్ సైన్స్ మాస్టర్ ఎజాజ్ అహమ్మద్ విద్యార్థుల దాడిలో మరణించడం విచారకరమని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఏపీ ఎన్జీవో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్, జిల్లా కార్యదర్శి రవికుమార్‌లు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా ఎన్జీవో కార్యాలయంలో వారు మాట్లాడుతూ పాఠశాల దశలోనే విద్యార్థుల ఆలోచన తీరు దారుణంగా మారడం బాధాకరమన్నారు. ఇలాటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు మేలు జరిగేలా ప్రభుత్వం ప్రజా ప్రాతినిధ్యం చట్టం రూపొందించా లన్నారు. టీచర్ ఎజాజ్ కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలసి టీచర్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘం నేతలు బాలపుల్లయ్య తమ్మారెడ్డి, కె.చిన్నయ్య, శైలే శ్వరరెడ్డి, శ్రీనివాసన్, నాగార్జున, పద్మనాభం, కాటమయ్య, జానకి తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలి

- జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి



కేంద్ర కారాగారంలో భోజనాలను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం మహిళ, పురుషుల కేంద్ర కారాగారాలతో పాటు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఆమె విజిట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖైదీలు ఉచిత న్యాయసహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి కేసుల వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. జైలు పరిసరాలను, వంట గదులను, వసతి గదులను, రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలను, సలహాలు ఇచ్చారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయసహాయం, లీగల్ సర్వీస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

పార్లమెంటులో మహిళలకు సమాన ప్రాధాన్యతనివ్వాలి

- ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త కల్పనా కన్నాబిరాన్



కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో మహిళలకు సమాన ప్రాధాన్యత కల్పించడం ద్వారా లింగ సమానత్వం సాధ్యమవుతుందని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త, కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంటు న్యాయవిద్వాంసులు ప్రొఫెసర్ కల్పనా కన్నాబిరాన్ అన్నారు. వైవీయూ అంతర్గత ఫిర్యాదుల కమిటీ, లైంగిక వేధింపుల నిరోధక కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జండర్ జస్టిస్ అండ్ కానిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియా పేరుతో శనివారం వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంప్రదాయక సామాజిక ఆలోచన సమాజంలో లోతుగా పాతుకుపోతున్నట్లయితే లింగ సమానత్వ లక్ష్యాలను సాధించదన్నారు. ముందుగా అది కుటుంబంలోని పిల్లల నుంచి సాంస్కృతిక అభ్యాసాలు స్వీయ స్పృహ, ప్రవర్తన ద్వారా రావాలని దిశ నిర్దేశం చేశారు. ఆర్టికల్ 14, 15, 106వ సవరణ చట్టం వంటి వివిధ ఆర్టికల్స్ ద్వారా లింగ న్యాయాన్ని ప్రోత్సహించడానికి రాజ్యాంగం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను అందించి సమానత్వం అనే ఆలోచనను ప్రతిబింబిస్తుందన్నారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ సమాన అవకాశాలు కల్పించడం ద్వారా స్త్రీ పురుషుల మధ్య అసమానతలు తొలగించవచ్చన్నారు. అనంతరం రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి వెబ్‌నార్ కన్వీనరు ప్రొఫెసరు అనిత మాట్లాడారు.

వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం రాజమార్గం

- మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి



మాట్లాడుతున్న మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరావు

కడప రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్తం రాజమార్గం లాంటిదని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరావు పేర్కొన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ సభ్యులకు, న్యాయవాదులకు మధ్యవర్తిత్వం అనే అంశంపై సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్‌ను శనివారం ఉదయం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ అని... ఇది వివాదాలను పరిష్కరిస్తున్న మంచి పద్ధతి అన్నారు. ఖర్చు, సమయాన్ని ఆదా చేస్తుందన్నారు. మధ్యవర్తిత్తం వలన వ్యక్తిగత సంబంధాలు చెడవన్నారు. మధ్యవర్తిత్వం నియమాలు 2007, సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వము, ప్రాజెక్టు కమిటీ నిబంధనలు 2015, మధ్యవర్తిత్వ చట్టం 2023, సివిల్ ప్రొడక్షన్ కోడ్ 1908, మధ్యవర్తిత్వం, రాజీ చట్టం 1996, మీడియోషన్ యాక్టు 2023 తదితర అంశాలను వివరించారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టం పై వర్క్‌షాపు

లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013, లింగ సున్నితత్వం తదితర అంశాలపై బార్ అసోసియేషన్ సభ్యులకు న్యాయవాదులకు సాయంత్రం వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరావు, డీఎల్ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్‌లు మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురైనపుడు పోష్ చట్టం 2013 కింద ఫిర్యాదు చేయవచ్చన్నారు. పోష్ చట్టంలోని సెక్షన్ 12(3) ప్రకారం పేర్కొన్న సంఘటనపై ఇతర చట్టాల వర్తింపుతో పాటు పేర్కొన్న శ్రామిక మహిళకు పరిహారం కోసం అపరాదుల జీతం తీసివేయడం జరుగుతుందన్నారు. పోష్ చట్టంలోని సెక్షన్ (3) గురించి వివరించారు.

కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షులు బి.గుర్రప్పనాయుడు, మీడియోషన్ న్యాయవాది చంద్రకాంతమ్మ, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

పిల్లల అభివృద్ధిలో తల్లి దండ్రులదే బాధ్యత ● పండుగలా సమావేశం ● మెనూ లోపంపై ఆగ్రహించిన తల్లిదండ్రులు






మన్నూరు ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం - టి.సుండుపల్లెలో విద్యార్థులకు మార్క్స్ లిస్టులు పంపిణీ చేస్తున్న జగన్‌మోహన్‌రాజు
అడపూరులో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న తల్లులు

రాజంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, పిల్లలు అభివృద్ధి చెందాలంటే తల్లి దండ్రులు బాధ్యత తీసుకోవాలని వక్తలు అన్నారు. పండుగలా నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యావంతులు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయా పాఠశాలల స్కూల్ కమిటీ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లు, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సిద్దవటం మండలం భాకరాపేట జడ్పీహైస్కూల్ తల్లిదండ్రుల సమావేశంలో ఏర్పాటు చేసిన భోజనంలో మెనూ సక్రమంగా లేదని, అన్నంలో పురుగులు వచ్చాయని తల్లి దండ్రులు ఆగ్రహించారు. వివరాల్లోకెళితే...

రాజంపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థుల ఔన్నత్యానికి, వారి ఉన్నత విద్య ప్రమాణాల సాధనకు ఐక్యంగా కృషి చేసి ముందుకు సాగాలని విద్యార్థుల తల్లిదండ్రులకు విన్నవించారు. రాజంపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కొండ్లోపల్లె పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి విజేతలకు ఎంపీటీసీ నాగ చంద్రశేఖర్ బహుమతులు అందజేశారు. డీబీఎన్‌పల్లె పాఠశాల సమావేశంలో హెచ్‌ఎం సిద్దయ్య, స్కూల్‌కమిటీ చైర్మన్ చంద్రకళ, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా శ్రీనివాసులు, కౌన్సిలర్ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు మండలంలో

రైల్వేకోడూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రోగ్రెస్ రిపోర్టుతోనే పిల్లల భవిష్యత్ ప్రణాళిక ఉంటుందని రైల్వేకోడూరు రెండో వార్డు ప్రభుత్వ ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. లక్ష్మీపతి తెలిపారు. పిల్లలు చదువుకునే సమయంలో తల్లిదండ్రులు టీవీలు పెట్టవద్దన్నారు. ఎఈఓ రామయ్య, సుందర్‌బాబు తదితరులు తనిఖీ చేశారు.

సుండుపల్లె మండలంలో....

సుండుపల్లె, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని, విద్యార్థుల ప్రవర్తన నడవడికపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు సూచించారు. తిమ్మసముద్రం హైస్కూల్‌లో సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులు పాఠశాలల్లో తరగతి గదిలో ఎలా మెలుగుతున్నారు. ఇండ్ల దగ్గర ఎలా ఉండారు అనే విషయాన్ని తల్లిదండ్రులు పరిశీలించాలన్నారు. చిన్నతనం నుంచే విద్య, ఆటపాటలు, క్రమశిక్షణ వైపు అడుగులు వేసేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో ఏమైనా సమస్యలపై ప్రశ్నించారు. పిల్లలకు ప్రగతి నివేదిక అందజేశారు. రాయచోటిలో కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రనాయక్, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు శివరాంనాయుడు, మోహన్‌బాబునాయుడు పాల్గొన్నారు.

నందలూరు మండలంలో....

నందలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆడపూరు గురుకుల పాఠశాలలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేత టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షులు దాసరి రాజు వాణి వ్యవహరించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. ప్రిన్సిపాల్ హైమావతి, పాఠశాల చైర్మన్ మురళి, ప్రభుత్వ వైద్యులు కార్తీక్ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు మండలంలో....

పెనగలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల సమావేశం పండుగ వాతావరణంలో జరిగింది. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ డ్రగ్స్ వినియోగం, అత్యాచార ఘటనలు, నేరాలు, శిక్షల గురించి పోలీసులు వివరించారు. ఎంపీడీఓ విజయరావు, ఏఓ పద్మభూషణ్‌రెడ్డి, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు మండలంలో....

గాలివీడు, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ వక్ఫ్ బోర్డు మెంబర్ మహబూబ్‌బాషా, విశ్రాంత లెక్చరర్ కానాల బయ్యారెడ్డి పేర్కొన్నారు. వెలిగల్లు, నూలివీడు విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో వారు మాట్లాడారు.

లక్కిరెడ్డిపల్లె మండలంలో....

లక్కిరెడ్డిపల్లె,డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పిల్లలు అభివృద్ధి చెందాలంటే తల్లిదండ్రులు బాధ్యతగా స్కూలుకు పంపించాలని ఎంఈఓ చక్రేనాయక్, ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మెగా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో దాత రామచంద్రయ్య టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన సయ్యద్ అక్రమ్, రొండ రాజాగిరిధర్‌కు నగదు బహుమతులు అందజేశారు.

చిట్వేలి మండలంలో....

చిట్వేలి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓలు కోదండనాయుడు, ఈశ్వరయ్య మాట్లాడారు. తుమ్మచెట్లపల్లె ప్రాథమిక పాఠశాల సమావేశంలో కమిటీ చైర్మన్ ప్రవీణ్ కుమార్, చిట్వేలి జిల్లా పాఠశాల కమిటీ చైర్మన్ శివశంకర్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిద్దవటం మండలంలో....

సిద్దవటం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కమ్మపాళెం, సిద్దవటం, పెద్దపల్లె, నేకనాపురం, జంగాలపల్లెల్లో పేరెంట్స్‌డే పండుగ వాతావరణంలో జరిగింది. సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, పార్ల మెంట్ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, విద్యా కమిటీ కోఆప్షన్ కృష్ణ, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి మండలంలో...

వీరబల్లి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసుకోవచ్చని తహసీల్దార్ శ్రావణి అన్నారు. ఎంఈఓలు రామక్రిష్ణ, కృష్ణయ్య, హెచ్‌ఎం రెడ్డెయ్య బహుమతులు అందజేశారు.

సంబేపల్లె మండలంలో....

సంబేపల్లె, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు మనందరి బాధ్యత అని ఎంపీడీఓ రామచంద్ర, సంబేపల్లె హైస్కూల్ హెచ్‌ఎం నరసింహారెడ్డి, సర్పంచ్ అంచల రామచంద్ర, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, పెద్దజంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చక్రపాణి, దుద్యాల ఉపసర్పంచ్ మౌనిక తెలిపారు. కమిటీ చైర్మెన్, వైస్ చైర్మెన్, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దజంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది టెన్త్‌లో ప్రతిభ చాటిన విద్యార్థి బండి ఆంజనేయులుకు హెచ్‌ఎం చక్రపాణి, ఉపాధ్యాయులు రూ.2 వేలు నగదు బహుమతి అందజేశారు. స్కూల్ కమిటీ చైర్మెన్ వీరేంద్ర, దేవేంద్ర, ఆంజనేయులు, సహదేవ, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామాపురం మండలంలో....

రామాపురం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలాదేవి పిల్లలకు చదువు ఎలా ఉంది. పిల్లల పట్ల ఉపాధ్యాయుల ప్రవర్తనపై తల్లిదండ్రులకు తెలియజేశారు.

ఓబులవారిపల్లె మండలంలో...

ఓబులవారిపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు హైస్కూల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. బొమ్మవరం ఎస్ఎంసీ చైర్మన్ చక్రవర్తుల సుబ్రమణ్యంరాజు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు హాజరయ్యారు.

పుల్లంపేట మండలంలో...

పుల్లంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు చక్రధర్‌రాజు, నాగతిరుమల రావు తల్లిదండ్లురకు పలు సూచనలు చేశారు. పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

ఒంటిమిట్ట చెరువుకు నీరు అందించాలి

ఒంటిమిట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట చెరువుకు వెంటనే నీరు అందించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ అన్నారు. ఒంటిమిట్ట చెరువుకు నీరు అందక రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని ప్రత్యక్షంగా, పరోక్షంగా రైతులకు ఎంతో ఉపయోగకరమైన నీటిని ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వహించి చెరువుకు నీరు అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. సోమశిల వెనుకజలాల నుంచి శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా ఒంటిమిట్ట చెరువుకు నీరివ్వాలని, 2014-2019 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు రైతుల కోసం ప్రారంభించారన్నారు. సమావేశంలో రైతులు యానాదయ్య, ఎం.పెద్దమునిరెడ్డి, సి.మనోహర్‌రెడ్డి, ఎస్.నాగేష్, కె.అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యం వర్ధిల్లాలి

రాయచోటిటౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మత సామరస్యం వర్ధిల్లాలి అంటూ శనివారం రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద నిరసన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇండియా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, భారత రాజ్యాంగంలో మతోన్మాదానికి చోటు లేదన్నారు. ప్రశాంతతకు, మతసారస్యానికి భంగం వాటిల్లకుండా నడుచుకోవాలని కోరారు. రాయచోటిలో గురు, శుక్రవారాల్లో జరిగిన ఘటనలు దురదృష్టకరమన్నారు.

నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

చిన్నమండెం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం చిన్నమండెం మండలం కమ్మపల్లి, చిన్నర్సుపల్లెల్లో నూతన బోరుకు మోటారు బిగించి గ్రామానికి నీటి సరఫరా చేసిన మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారన్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ప్రజా దర్బార్ ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బోరెడ్డిగారి పల్లెలోని తమ నివాసంలో మంత్రి మండిపల్లి ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజా దర్బార్‌లో 90 శాతానికి పైగా భూ సమస్యలే వస్తున్నాయని, రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి

రాయచోటిటౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి విశేష కృషి చేస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మాసాపేట మార్కెట్ యార్డులో దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ 65వ దివ్యాంగుల వారోత్సవాలు గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాధ్‌నాయక్ అధ్యక్షతన జరిగాయి. విభిన్న ప్రతిభావంతులకు బెడ్ షీట్స్ పంపిణీ చేపట్టారు. సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసిం హులు, అర్చనా విద్యాసంస్థల డైరెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, సుగవాసి విద్యాధర్, రోటరీక్లబ్ సభ్యులు కృష్ణదేవరాయులు, కేవీఎస్‌నాయుడు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్, లంబాడా సంఘం జాతీయ నేతలు శంకర్‌నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ అన్వర్‌బాషా, దివ్యాంగులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

మున్సిపాలిటీ పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్మికులు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ యూనియన్ నాయకులు కేశవరావు, కృష్ణయ్య, శేషాద్రిబాబు, వెంకటేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ

మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ నందిని



న్యాయవాదులతో సెన్సిటైజేషన్ నిర్వహిస్తున్న జడ్జి నందిని

నందలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ. ఇది వివాదాలను పరిష్కరిస్తున్న మంచి పద్ధతి, ఖర్చు, సమయాన్ని ఆదా చేస్తుందని మండల లీగల్‌సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ జె.నందిని అన్నారు. జూనియర్ సివిల్‌కోర్టులో బార్ అసోసియేషన్ న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై సెన్సిటైజేషన్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విభాగం-89 సీపీసీ ఆర్డర్-1 రూల్-10 ప్రత్యామ్నాయ వివాదం స్పష్టత మధ్యవర్తిత్వ నియమాలు మధ్యవర్తిత్వం, రాజీ జట్టం 1996 స్థాపనలను చేయడానికి నిబంధలు చేస్తున్నారు. మీడియేషన్ యాక్టు 2023 సెక్షన్ 6, 320 సీఆర్‌పీసీ తదితర అంశాలను వివరించారు. న్యాయవాదులు ఏవీ సుబ్రమణ్యం, దాసరి నరసిం హులు, షేక్ మహ్మద్‌అలీ, సుబ్బరామయ్య, షమివుల్లాఖాన్, జానకిరామయ్య, శివారెడ్డి, ఆసియా, హెచ్.ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె, మధ్యవర్తిత్వం, సెన్సిటైజేషన్‌పై అవగాహన కలిగిండాలని లక్కిరెడ్డిపల్లె సివిల్ జడ్జిలు ప్రవీణ్‌కుమార్, షైజున్నీసా పేర్కొన్నారు. స్థానిక సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల సదస్సులో వారు మాట్లాడారు. 14న జాతీయ లోక్ అదాలత్ ఉంటుందని ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. బార్ ప్రెసిడెంట్, ఎంఎల్ రామచంద్రారెడ్డి, ఏజీపీ బాలాజీరెడ్డి, చెన్నక్రిష్ణయ్య, రెడ్డెన్న పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి హోమాలు



రామాపురం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పప్పిరెడ్డిగారిపల్లె సమీపంలో గంగాభవాని సమేత మూలస్థానేశ్వరస్వామి (శివాలయం హసనాపురం) శివాలయంలో శనివారం అర్ష విజ్ఞాన పరిషత్ హైదరాబాద్ సౌజన్యంతో సుబ్రహ్మణ్య మూల మంత్రంతో సహస్ర ఆవృతుల హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మెన్, సభ్యుల ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యం షష్టి హోమాలు ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ శనివారం సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా సుబ్రహ్మణ్య మూల మంత్రంతో సహస్ర అవృతుల హోం, విష్ణుభట్ల లక్ష్మీపతి ఘనాపాటి సోమయాజులు ఆధ్వర్యంలో హోమం నిర్వహిచారు. అనంతరం విభూదిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లాస్ వన్ కాంట్రాక్టర్, మాజీ సర్పంచ్ పప్పిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, దంపతులు నిషితరెడ్డి, బీట్స్ కాలేజీ అధినేత భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మిక సంఘం అధ్యక్షుడిగా వినయ్

రైల్వేకోడూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడిగా మొగిలి వినయ్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రేవూరి క్రిష్ణయ్య, మల్లిక రమణయ్య, కే. వెంకటరమణ, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా ఎం. జయరామయ్య, బండెల శివశంకర్, షేక్ హాజ్మాబీ, ఇంద్రాణి, కోశాధికారిగా కే. వెంకటరమణ, కార్యవర్గ సభ్యులుగా వెలుగు లక్ష్మయ్య, గుడిసి జయరామయ్య, వెంకటయ్య, లక్ష్మయ్య, కళావతి, ఆవుల సురేష్, సుబ్బయ్య, ఈశ్వరమ్మ, జలకం బంగారమ్మ, సుబ్బ నరసమ్మ, రవి, షేక్ షాహిన్హా తదితరులను ఎన్నుకున్నామని వ్యవసాయ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వర్‌రావు తదితరులు ప్రకటించారు.

బంజరును పేదలకు పంచి పెట్టాలి

వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్



సభలో ప్రసంగిస్తున్న ఆవుల శేఖర్

రైల్వేకోడూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బంజరు భూములను పేదలకు పంచి పెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం రైల్వేకోడూరు సీపీఐ కార్యాలయం ఆవరణలో వ్యవసాయ కార్మిక సంఘం నాల్గొవ మహాసభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, కూలీలు, దళితులు, గిరిజనుల కోసం నిరంతరాయంగా పోరాటాలు చేసి వారికి హక్కులు కల్పించమని ప్రభుత్వాలను అడుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం మిగులు భూములను దళితులు, గిరిజనులు, వ్యవసాయ కూలీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కోనేరు రంగారావు భూ కమిటీ ఏర్పాటు చేసి రాష్ట్రంలో అసైన్‌మెంట్ మిగులు భూములు రాష్ట్రంలో 1.85 కోట్ల ఎకరాలు వ్యవసాయానికి అనువుగా ఉందని నివేదిక ఇచ్చారని తెలిపారు. దళితులు, గిరిజనులు, వ్యవసాయ కూలీలకు ఈ భూములను ఇవ్వవచ్చని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు భూ పంపిణీ చేపట్టాలని కోరారు. ప్రతి పేదవాడికి 5సెంట్ల స్థలం సహా ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు నగదు ఇవ్వాలన్నారు. రెవెన్యూ అధికారుల ముసుగులో ఇద్దరు బాబులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను భూ పోరాటాల ద్వారా నిరుపేద గిరిజనులకు పంచుతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, కార్యదర్శి కృష్ణప్ప, రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వర్‌రావు, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రావు, జిల్లా కార్యదర్శి పీఎస్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా ఉచిత వైద్యశిబిరం

రాజంపేట టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బంద్రాళ్ల వీధిలో ఆదివారం బాలాజీ ఫిజియోథెరపి ఆస్పత్రిలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బి.నాగాంజనేయులు తెలిపారు. నడుము నొప్పి, మోకాళ్ల నొప్పి, పక్షవాతం, మూతివంకర, తిమ్మిర్లుతో బాధపడే వారికి ఈ ఉచిత వైద్యశిబిరంలో చికిత్స చేస్తారన్నారు. స్త్రీలు ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికి సీనియర్ ఆర్థోపెడిక్ స్పెషలిస్టు డాక్టర్ వరలక్ష్మీ వైద్యసేవలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

తుఫాను బాధితులను ఆదుకోవాలి

నందలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫానుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వ్యవసాయ సహకార మార్కెటింగ్ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడును కోరినట్లు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. వారి స్వగ్రామంలో మర్యాద పూర్వకంగా కలిసిన ఆయన మాట్లాడుతూ నందలూరు, సిద్దవటం, సుండుపల్లె, వీరబల్లె మండలాల్లో ఫెంగల్ తుపానుతో రైతులు నష్టపోయారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. లేబాక సర్పంచ్ లంకయ్యగారి నరసయ్య, టంగుటూరు ఎంపీటీసీ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ తల్లి సుభిక్షంగా చూడాలి

సుండుపల్లె, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మారెమ్మ తల్లిని కోరుకున్నారు. శనివారం మాచిరెడ్డిగారిపల్లె గ్రామం పాలెంగడ్డబిడికిలో మారెమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పూజలు చేయించి అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. రాయవరం సర్పంచ్ షరీఫ్, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబు నాయుడు, సుండుపల్లె టీడీపీ నేతలు శివరాంనాయుడు, రఫీక్, ఐటీడీపీ మండల అధ్యక్షుడు ఎల్‌వీ రమణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చంద్రమౌళి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

రామాపురం, డిసెంబరు7: ప్రకృతి వ్యవసాయం, ఆహారం, ఆరోగ్యంపై రామాపురం ఆదర్శ పాఠశాల విద్యార్థులకు శనివారం ఇన్‌చార్జి ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలోని శాస్త్రీయతను, ప్రకృతి వ్యవసాయ పద్దతిలో పండించిన ఆహారం తినడంతో కలిగే లాభాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో కిచెన్ గార్డెన్ న్యూట్రీ గార్డెన్ పాఠశాల పరిధిలో నమూనాను వేయించి అవగాహన కల్పించారు. రామాపురం డివిజన్ ఎంటీ మధుకర్, ఎంఎంటీఎల్ చందురెడ్డి, హెచ్‌ఎన్ ఎస్ఎఫ్ఎఫ్ పావని, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలి

సంబేపల్లె, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ శెట్టిపల్లె శాఖలో ఖాతాతో బీమా కూడా చేసుకోవాలని మాజీ జడ్పీటీసీ నరసారెడ్డి, శాఖ బ్రాంచ్ మేనేజర్ అరుణ కుమారిదేవి తెలిపారు. బ్యాంకు పరిధిలో ఖాతాల ప్రారంభం చేపట్టారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ప్రగతి త్రివేణి పథకం కింద 333 రోజులకు 8.20 శాతం ప్రగతి కుబేర్ పథకం కింద 444 రోజులకు 8.30 శాతం వడ్డీ చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల శెట్టిపల్లె గ్రామం దిగువ హరిజనవాడకు చెందిన శెట్టిపల్లి మల్లీశ్వరి, శెట్టిపల్లి శంకరమ్మ వ్యవసాయ పనులకు వెళ్లి పిడుగుపాటుకు గురై మృతి చెందిన వారు బ్యాంకులో ప్రధాన జీవనజ్యోతి బీమా యోజన కింద ఇన్సూరెన్స్ చేసుకోవడంతో ఒక్కొక్కరికి రూ.2 లక్షలు చొప్పున చెక్కు బ్యాంకు వారు అందించారు. అసిస్టెంట్ మేనేజర్ కృష్ణవేణి, బ్యాంక్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

గాలివీడు, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలో పక్కా గృహాల లబ్ధిదారులు నిర్మాణాలను వెంటనే పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ రమేష్‌నాయక్ తెలిపారు. శనివారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో మండలానికి 2371 గృహాలు మంజూరయ్యాయని, 1675 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని తెలియజేశారు.

కలెక్టరేట్ ముఖ ద్వారం ఎదుట..



జాయింట్ కలెక్టర్ పేషీ దగ్గర..



నిఘా నీడలో కలెక్టరేట్

- ప్రతి సెక్షన్‌లోనూ సీసీ కెమెరాలు
- సిబ్బందిపై నిఘా
- ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్న జేసీ

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో రెండు రోజుల క్రితం 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పటిష్ఠం చేశారు. కలెక్టరేట్‌కు వచ్చేవారు పోయే వారిపై కూడా నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. కలెక్టరేట్‌లోని ప్రతి సెక్షన్‌లో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సిబ్బందిపై మరింత నిఘా పెట్టారు. ప్రతిరోజూ కలెక్టరేట్ సిబ్బంది ఎన్ని గంటలకు వస్తున్నారు. ఎన్ని గంటలకు వెళుతున్నారు అన్న విషయాలపై జాయింట్ కలెక్టర్ పూర్తిగా ఆరా తీసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. అసలు కలెక్టరేట్‌లో 12 కెమెరాలు ఎందుకు పెట్టాల్సి వచ్చింది. అంటే సిబ్బంది వస్తున్నారా లేదా వచ్చిన తర్వాత ఏం చేస్తున్నారు అన్న విషయాలపై జాయింట్ కలెక్టర్ ప్రతిరోజూ పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలుస్తోంది. కలెక్టరేట్‌లోని కొంతమంది సిబ్బంది సమయానికి రాకుండా ఏదో ఒక సాకు చెప్పి గంటల తరబడి ఫోన్‌లో మాట్లాడుతున్నారని, అటువంటి వారి వల్ల కలెక్టరేట్‌కు చెడ్డపేరు వస్తోందన్న ఉద్దేశ్యంతో ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు కొంత మంది అధికారులు చెప్పుకొస్తున్నారు. ఈ విషయంపై కలెక్టరేట్ ఏవో నాగభూషణంను వివరణ కోరగా కలెక్టరేట్ సిబ్బంది సమయానికి రాకపోవడం వల్లనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంకా కొన్ని రోజుల తర్వాత ప్రతి ఒక ఉద్యోగి ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.



కో-ఆర్డినేషన్ సెక్షన్‌లో..

నాగన్న స్టేజి ఎక్కితే.. అవార్డుల పంటే

- పౌరాణిక, జానపదంలో ఆయన నటన అద్భుతం
- ఐదువేల ప్రదర్శనలతో నేటికీ కళామతల్లి సేవలోనే

చెన్నూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆయన పుట్టిందో పల్లెటూరు.. వృత్తిరీత్యా బ్యాంకు ఉద్యోగి. ప్రవృత్తి కళాకారుడు. నటనలో మేటిగా రాణిస్తున్న ఆయన స్టేజీ ఎక్కాడంటే అవార్డు ఆయన వద్దకు రావాల్సిందే. ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకుని 50 ఏళ్లకు పైగా నాటకంలో రాణిస్తూ అద్భుతం అనిపించుకున్న ఆ కళాకారుడే చెన్నూరుకు చెందిన సురతాని నాగన్న. జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు లెక్కలేనన్ని అవార్డులు అందుకున్న నాటక బ్రహ్మ. చెన్నూరు స్టేట్ బ్యాంకులో అసిస్టెంటు మేనేజరుగా పని చేసి పదవీ విరమణ పొందారు. ఆయన స్వగ్రామం చక్రాయపేట మండలం నెరసుపల్లె. 1954లో జన్మించారు. 1972లో 9వ తరగతి చదివే సమయంలో చిన్నపాటి వేషధారణలతో నటనపై మక్కువతో అడుగు పెట్టి 50 ఏళ్లుగా నాటకాల్లో వైవిధ్యభరితమైన పాత్రల్లో రాణించాడు.

5 వేలకు పైగా నాటకాలు

ఐదువేలకు పైగా నాటకాల్లో పాల్గొన్న ఆయన 200కు పైగా వివిధ రకాల వేషాలతో కళలు ప్రదర్శించారు. 150 ఏకపాత్రాభినయాలతో ప్రముఖుల మన్ననలు అందుకున్నారు. 50 మార్లు దశరథుడి పాత్రలో ఇమిడి తన అద్భుత నటనా కౌశల్యంతో ఆకట్టుకున్నాడు. 1984లో నవేరా ఆర్ట్స్ గ్రూపులో సభ్యుడిగా చేరి ఆ సంస్థకు 12 మార్లు నంది అవార్డు వచ్చేందుకు కృషి చేశారు. జనకుడు, గౌతముడు, బ్రహ్మ, రావణుడు, రావణబ్రహ్మ, మాయారావణుడు, విభీషణుడు, వెంకటేశ్వరుడు, మారీచుడు, యముడు, మారుతి, తాండ్రపాపారాయుడు, శకుని, అర్జునుడు, శ్రీనాథ కవి, హరిశ్చంద్ర ఇలా ఎన్నో వైవిధ్యమైన పౌరాణిక జానపద పాత్రల్లో అద్భుతంగా నటించారు. స్టేజీపై నిలిచాడంటే తన పాత్రలో ఒదిగిపోయి ప్రేక్షకుల చేత చప్పట్లు, ప్రముఖుల చేత శాలువాలు కప్పించుకోవడం సాధారణమైంది. ఏ పాత్ర వేసినా తనకు తానే సాటి అనిపించుకున్నాడు. ఆ పాత్రను చూసిన ప్రేక్షకుడు ఈ పాత్ర నాగన్న మాత్రమే చేయగలడనే విధంగా అనిపించుకున్నాడు.

ఆరు రాష్ట్రాల్లో అలరించిన కళాకారుడు

ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా ఈ ఐదు రాష్ట్రాల్లో కళాకారుడుగా వివిధ రకాల పాత్రలతో నాగన్న అలరించాడు. వెంకటేశ్వర వైభవం, శ్రీరామవనవాసం, పాదుకా పట్టాభిషేకం, వాసవీ కన్యక, భక్త మారుతి, సతీ అహల్య, శ్రీరామ పాదుకలు, సత్యహరిశ్చంద్ర (కాటిఘట్టం) శ్రీనాథ కవిసార్వభౌమ, పద్మావతి వైభవం లాంటి గొప్ప నాటికల్లో ప్రధాన పాత్రలతో అలరించారు. ప్రతి పాత్రను అలవోకగా పండిస్తూ స్టేజీపై తాను వేసిన పాత్రలో ప్రేక్షకులు గుర్తించుకునేలా ప్రదర్శించారు. దీంతో ఆరు రాష్ట్రాల్లో స్టేజీలపై ప్రదర్శించిన ప్రతి పాత్రకు అక్కడి ప్రజలు జేజేలు కొట్టారు. అభినందనలు తెలిపారు.

ప్రముఖులతో ప్రశంసలు

హైదరాబాదులో జరిగిన తెలుగు ఆత్మగౌరవ దినోత్సవంలో నందినాటక ఉత్సవాల్లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. 2005లో తిరుపతిలో జరిగిన జాతీయ స్వర్ణోత్సవాల్లో భక్తమారుతి పాత్రను ప్రదర్శించినప్పుడు అప్పటి ఉమ్మడి రాష్ట్ర స్పీకరు కిరణ్‌కుమార్‌రెడ్డి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి దాసరి నారాయణ రావు చేతుల మీదుగా ప్రశంసలు, నేషనల్ అవార్డులు అందుకున్నారు. అలాగే 1994లో ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రముఖులచే సత్కారాలు అందుకున్నారు. 2002లో కడపలో సౌజన్య కళామండలిచే కడప రత్న అవార్డు, 2004లో అప్పటి కలెక్టరు జయేశ్‌రంజన్ చేతుల మీదుగా కడప ప్రతిభా అవార్డు, 2012లో ప్రొద్దుటూరులో జరిగిన స్వామిక్రియేషన్స్ వారితో రాయలసీమ కళారత్న అవార్డు, 2014లో బళ్లారిలో జరిగిన నాటకోత్సవంలో బళ్లారి రాఘవ అవార్డును, 2015లో అప్పటి సుప్రీంకోర్టు జడ్జి శేషసాయి చేతుల మీదుగా పౌరాణిక నట బ్రహ్మ అవార్డులు అందుకున్నారు. అలాగే అదే ఏడాది విజయవాడ మానస సాహిత్య సాంస్కృతిక అకాడమీలో అక్కినేని పురస్కారం కూడా అందుకున్నాడు. 2021లో నటకళారత్నగా 2022లో జిల్లా కలెక్టరు విజయరామరాజు చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. 2024 ఆగష్టు 9న ఎర్రగుంట్లలో ప్రముఖుల చేతులో రజత హస్త కంకణాన్ని, సత్కారాన్ని అందుకున్నాడు. ఇవే కాక నాటి మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, గవర్నరు వెంకటసుబ్బయ్య, కొప్పర్తి సుబ్బారావు వంటి ప్రముఖుల ద్వారా ప్రశంసలు అందుకున్నాడు.



అవార్డులతో నాగన్న

ఎస్‌బీఐలో నాలుగు సార్లు అవార్డులు

చెన్నూరు స్టేట్‌బ్యాంకులో అసిస్టెంటు మేనేజరుగా పనిచేసిన ఆయన తన 25 ఏళ్ల సర్వీసును చెన్నూరు ఎస్‌బీఐలోనే గడిపారు. గురువు ఆళ్లగడ్డ శ్రీనివాసులు (ఆయన ఘంటసాల జతలో అలరించారు) ఆధ్వర్యంలో నటనలో తీర్చిదిద్దబడ్డ నాగన్న హైదరాబాదులో ఎస్‌బీఐ ఎండీ చేతుల మీదుగా 1986, 2009లో ఘన సన్మానాలు అందుకున్నారు. నేటికీ కళామతల్లి ముద్దుబిడ్డగానే రాణిస్తూ ఊపిరి ఉన్నంత వరకు కళామతల్లి సేవ చేస్తూనే ఉంటానన్నారు. వృత్తిలో ఎంత ఒత్తిడిలో ఉన్నా నాటకరంగాన్ని అలవోకగా పండించడం, ఐదువేలకు పైగా నాటకాల్లో పాల్గొనడం ఆయన కళాతృష్ణకు నిదర్శనం. అలాంటి వ్యక్తి చెన్నూరులో ఉండడం గర్వకారణమని స్థానికులు చెబుతుంటారు.







నాటి సీఎం చంద్రబాబు, అప్పటి స్పీకరుగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి, అప్పటి కడప కలెక్టరు శశిభూషణ్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న నాగన్న

కళామతల్లే నా ప్రాణం



ఊపిరి ఉన్నంత వరకు కళామతల్లికి సేవ చేస్తునే ఉంటా. 70 ఏళ్ల వయసులో ఎవరు ఏ నాటక విషయంలో ఎక్కడికి పిలిచినా వెళుతునే ఉన్నా. బ్యాంకు ఉద్యోగిగా సర్వీసులో ఎంత సేవ చేసినా కళామతల్లి సేవలో ఉన్న ఆనందం మరేదాంట్లోనూ నాకు లేదనిపిస్తుంది. అందుకే ఆ తల్లికి నేను ఎప్పటికీ చిన్నబిడ్డనే. నా శ్వాస, ధ్యాస అంతా కళామతల్లి వద్దనే. ఊపిరి ఉన్నంత వరకు కళాకారుడిగానే జీవిస్తా.

-నాగన్న, కళాకారుడు, చెన్నూరు

మధ్యవర్తిత్వంతో సంబంధాలను పునరుద్ధరించవచ్చు

- కడప ప్రత్యేక న్యాయమూర్తి హేమస్రవంతి జానకీరాం

రైల్వేకోడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో విచ్ఛిన్నమైన సంబంధాలను పునరుద్ధరించవచ్చని కడప ప్రత్యేక న్యాయమూర్తి హేమస్రవంతి జానకీరాం తెలిపారు. శనివారం రైల్వేకోడూరు న్యాయస్థానం ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయవాదులకు ఒక్క రోజు పాటు మధ్యవర్తిత్వం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక కేసుకు సంబంధించి ఏ దశలోనైనా న్యాయవాదులు మధ్యవర్తిత్వం ప్రారంభించవచ్చని తెలిపారు. మధ్యవర్తిత్వం వలన ఇరు పార్టీలకు సయోధ్య ఏర్పడుతుందన్నారు. భార్య భర్తల కేసులు, ప్రామిసరీనోటు (చెక్‌బౌన్స్ కేసు) వంటి కేసులను సామరస్యంగా పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. వారి మధ్య విద్వేషాలను తొలగించి, ఇరువురు స్నేహ పూర్వకంగా మసలుకోవడానికి న్యాయవాదులు సహాయపడాలని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారావు, సీనియర్ న్యాయవాదులు వెంకట్రామరాజు, రెడ్డయ్యనాయుడు, మధుసూదన్‌రావు, సురేష్‌రెడ్డి, చెంచురామయ్య, శంకరయ్యనాయుడు, మహిళా న్యాయవాది అంబికా తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి హేమస్రవంతి జానకీరాం

హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి
- గొడవలు జరిగితే కఠిన చర్యలు : ఎస్పీ

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలిగి ఎటువంటి గొడవలకు చోటు ఇవ్వరాదని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రితో పాటు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్‌ల ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న గొడవలను దృష్టిలో ఉంచుకుని హిందూ, ముస్లింలతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఎటువంటి గొడవలకు తావివ్వకుండా హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో ఎటువంటి గొడవలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో కొంతమంది ఆకతాయిలు గొడవలు సృష్టిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని, రాత్రి 10.30 గంటల తర్వాత అత్యవసర పరిస్థితుల్లో తప్ప అనవసరంగా ఎవరూ బయట తిరగకూడదన్నారు. రాయచోటి పట్టణం ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా పెడతామన్నారు. పట్టణంలో ఎటువంటి చిన్న సమస్య కూడా తలెత్తకుండా ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ పుల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అవాస్తవాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

రాయచోటిటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదాన్ని కొందరు ఆకతాయిలు అసత్య ప్రచారాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇప్పటికే 150 మంది అసాంఘిక శక్తులను డ్రోన్ టెక్నాలజీ, ఇతర అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించామన్నారు. వీరిపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించినట్లు ఎస్పీ తెలిపారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా దుష్ప్రచారం చేసే సంఘవిద్రోహ శక్తులు, ప్రజలను రెచ్చగొట్టే వారిపై నిఘాఉంచామని తెలిపారు.


యల్లంరాజుచెరువు అందాలు, అలుగు పారుతున్న దృశ్యం



గల..గల..పారుతూ..

ఇటీవల కురిసిన వర్షాలకు నదులు, చెరువుల అలుగులు గలగలా పారుతున్నాయి. ఆయా ప్రాంతాలు పచ్చని చెట్లతో కనువిందు చేస్తున్నాయి. పక్షుల కిలకిలలు, అలుగుల వద్ద చిన్నపిల్లల కేరింతలు, కొత్త నీరు వచ్చిన చేప పిల్లల పులకరింతలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. సాయంత్రమైతే మరింత ఆహ్లాదకరంగా వాతావరణం ఉంటోంది. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని చిట్వేలి మండలం యల్లంరాజుచెరువు, చెక్‌డ్యాంలు, చిట్వేలి-రాపూరు మార్గం మధ్య నేల, నీరు, ఆకాశం కనిపించే అందాలు చూడవచ్చు.

- రైల్వేకోడూరు (ఆంధ్రజ్యోతి)



నింగి, నీరు కనిపించే విధంగా ఉన్న అందమైన దృశ్యం

చదువులమ్మ ఒడి.. ప్రభుత్వ బడి

- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థుల ప్రతిభ
- అడ్మిషన్లూ 1500 పైనే
- మార్కుల్లో ప్రతి ఏటా టాపే

బద్వేలు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేలకు వేలు ఫీజులు చెల్లిస్తే తమ పిల్లలకు మంచి విద్య అందుతుందని తల్లిదండ్రులు భావిస్తుంటారు. కొంతమంది స్తోమత లేకపోయినా తమ పిల్లలకు మంచి విద్య అందించాలనే తాపత్రయంతో ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తుంటారు. కానీ ప్రైవేటుకు ఏమాత్రం తీసిపోని విధంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పేరు తెచ్చుకుంటోంది. మంచి విద్యనందిస్తూ చదువులమ్మ ఒడిగా ప్రశంసలు పొందుతోంది. ఇక్కడి విద్యార్థులు గత ఐదేళ్లుగా పదవ తరగతి ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలతో పోటీపడి మంచి మార్కులు సాధిస్తున్నారు. దీంతో పట్టణంలో బెస్ట్ పాఠశాలగా పేరు గాంచింది. 1918లో ప్రారంభమైన ఈ పాఠశాల.. ప్రత్యేక తరగతులు, అత్యుత్తమ శ్రద్ధ, ఉత్తమ బోధనతో విద్యను అందిస్తోంది. అటు చదువులోనూ, ఇటు ఆటల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను కనబరుస్తున్నారు.



బద్వేలు బాలుర ఉన్నత పాఠశాల

విద్యార్థుల సంఖ్యలోనూ టాప్

కొన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ ఎక్కువమంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళుతుంటారు. కానీ బద్వేలు పట్టణంలోని కన్యకా పరమేశ్వరి బాలుర ఉన్నత పాఠశాలలో మాత్రం ఇందుకు భిన్నంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. గత నాలుగేళ్ల క్రితం నుంచి అడ్మిషన్ల సంఖ్య జోరందుకుంటోంది. ప్రస్తుతం 1630 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



ఆటల పోటీలలో మెడల్స్ సాధించిన విద్యార్థులు (ఫైల్)

చదువుతో పాటు, ఆటల పోటీల్లోనూ

పది ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలు తమ విద్యార్థులు టాప్‌లో నిలిచారంటూ ఊదరగొడుతుంటారు. బద్వేలు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు కూడా వారితో పోటీపడుతున్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో 586 మార్కులు సాధించారు. 50 మందికి పైగా 500 పైబడి సాధించి జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన పాఠశాలగా పేరొచ్చింది. గత నాలుగేళ్ల నుంచి ప్రతి ఏడాది పదిలో మంచి మార్కులు సాధిస్తున్నారు. చదువులోనే కాకుండా ఆటల పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి వాలీబాల్, ఖోఖోలో విద్యార్థులు అనేక బహుమతులు సాధించారు.



వాలీబాల్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు (ఫైల్)

పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. ఇక పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఉదయం 8 గంటలకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నాం. ఈసారి కూడా మంచి మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నాం.

- జి.వెంకటసుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, బద్వేలు

ప్రభుత్వాస్పత్రి వద్ద ఘర్షణ

- ఇన్‌స్టాగ్రాం పరిచయం తెచ్చిన తంటా... కొట్టుకున్న ఇరువర్గాలు

మదనపల్లెఅర్బన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రాంలో పరిచయంతో తన భార్యకు ఓ యువకుడు ఫోన్‌లు చేస్తున్నాడని ఆగ్రహించి ఆ మహిళ భర్త ఆ యువకుడిపై దాడి చేసి కొట్టాడు. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లెకు చెందిన ఓ యువకుడు (21)కి ఇన్‌స్టాగ్రాంలో మదనపల్లెకు చెందిన ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. దీంతో వారిద్దరూ మెసేజ్‌లు పెట్టుకోవడంతో పాటు ఫోన్‌లో కూడా మాట్లాడుకుంటుండేవారు. ఈ విషయం ఆమె భర్తకు తెలియడంతో అతను ఆమెను వారించాడు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం మదనపల్లె ప్రభుత్వాస్పత్రి వద్ద ఆ మహిళతో ఆ యువకుడు మాట్లాడుతుండగా అక్కడికి వచ్చిన ఆ మహిళ భర్త వారిద్దరిని చూసి ఆగ్రహంతో ఆ యువకుడిపై దాడి చేశాడు. దీంతో వారిద్దరూ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఆ యువకుడు గాయపడగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది.



జిల్లా ఆస్పత్రి వద్ద గొడవ పడుతున్న ఇరువర్గాలు

వామ్మో..వరికోతలు



- వరికోత యంత్రాల యజమానులు సిండికేట్
- తమిళనాడు హార్వెస్టర్లు రాకుండా అడ్డగింపు
- గంటకు రూ.3500 చార్జీలు ● కూలీల కొరతతో ఇక్కట్లు
- గత్యంతరం లేక హార్వెస్టర్లను ఆశ్రయిస్తున్న రైతులు
- కుదేలవుతున్న అన్నదాతలు

కడప రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరికోతలు రైతులకు భారంగా మారాయి. కూలీలంతా ఉపాధిహామీ పథకం పనుల వైపు మొగ్గు చూపుతుండడంతో కోతలకు కూలీల కొరత అడ్డంకిగా మారింది. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు వరికోత యంత్రాల(హార్వెస్టర్ల)ను ఆశ్రయిస్తున్నారు. దీంతో హార్వెస్టర్లకు రైతుల నుంచి డిమాండ్ అధికంగా ఉండడంతో యజమానులు సిండికేట్ అయ్యారు. అమాంతంగా ధరలను పెంచేశారు. చైన్ హార్వెస్టర్‌కు గంటకు రూ.3500లు, టైర్ల హార్వెస్టర్‌కు రూ.2500 పైబడి తీసుకుంటున్నారు. ఒక ఎకరా వరికోతకు రెండు గంటల సమయం పడుతుండడంతో రైతు దాదాపు రూ.7000లు చెల్లించాల్సి వస్తోంది. ఇది రైతుకు అదనపు భారం అవుతోంది. గత ఏడాది గంటకు చైన్ హార్వెస్టర్‌కు 2800 నుంచి రూ.3000లు, టైర్ల హార్వెస్టర్‌కు అయితే 1800 నుంచి 2000ల వరకు చార్జీలు ఉండేవి. అయితే ఈ ఏడాది ఉన్నఫలంగా హార్వెస్టర్ల యజమానులు ధరలను పెంచేశారు. కారణం గతంలో వరికోత సీజన్‌లో తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాల నుంచి వరికోతయంత్రాలు వచ్చేవి. ఇవి మన జిల్లాలోని హార్వెస్టర్ల ధరల కన్నా రూ.300 నుంచి 500 వరకు తక్కువ ధరతో వరికోతలను కోసేవారు. అయితే ప్రస్తుత సీజన్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న హార్వెస్టర్లను ఇక్కడి హార్వెస్టర్ల యజమానులు రాకుండా చేసి... సిండికేట్‌గా మారి అధిక ధరలను నిర్ణయించారు. దీంతో రై చేసేదిలేక అధిక ధరలను చెల్లించి వరి కోతలను కొనసాగిస్తున్నారు.

ముమ్మరంగా వరికోతలు

జిల్లాలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. 2024 ఖరీఫ్‌లో జిల్లాలో కేసీ కెనాల్ ఆయకట్టుతో పాటు, బోరు బావులు, నదీ పరివాహక ప్రాంతాలతో పాటు ఇతర నీటి వనరుల కింద 28వేల హెక్టార్లకు పైగా రైతులు వరి పంటను సాగుచేశారు. ఇప్పటికి దాదాపు 12వేల హెక్టర్ల వరకు వరికోతలు జరిగాయి. ఇంకా 14వేల హెక్టార్లు పైబడి వరికోతలు జరగాల్సి ఉంది. ఇందులో బోరుబావులు, ఇతర నీటి వనరుల కింద సాగుచేసిన వరికోతలు నవంబర్ మధ్యస్థం నుంచి ప్రారంభమయ్యాయి. కేసీ కెనాల్ ఆయకట్టు కింద కాస్త ఆలస్యంగా వరి పంట సాగుచేయడంతో డిసెంబర్ మధ్యస్థం నుంచి జనవరి వరకు కోతలు కొనసాగనున్నాయి. ప్రస్తుతం 40 శాతం వరకు వరికోతలు పూర్తయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో సాగుతున్నాయి. జిల్లాలో హార్వెస్టర్ల సంఖ్య తక్కువగా ఉండడంతో ఆదే అదునుగా భావించిన కొందరు యజమానులు చార్జీలు అమాంతం పెంచారు. గత ఏడాది టైర్ల హార్వెస్టర్‌కు గంటకు రూ.1600 నుంచి 1800ల వరకు వసూలు చేయగా ప్రస్తుతం రూ.2,000 నుంచి రూ.2500 వరకు డిమాండ్ చేస్తున్నారు. దీనికితోడు ఫెంగల్ తుఫాను ప్రభావం కొనసాగుతుండడంతో రైతులు వర్షం నుంచి పంటను కాపాడుకోవడానికి తాపత్రయ పడుతున్నారు. ఈ అవకాశాన్ని చైన్ హార్వెస్టర్లు ఆసరాగా చేసుకుని అందినకాడికి దండుకుంటున్నారు. ఒక గంటలకు రూ.3500 వరకు వసూలు చేస్తున్నారు. అయినా గత్యంతరం లేక హార్వెస్టర్‌తో కోయిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యయం పెరిగింది



వరి సాగుకు ఏటేటా వ్యయం పెరుగుతోంది. నేను 1.50 ఎకరాలలో వరిపంట సాగుచేశాను. తుఫాన్ ప్రభావంతో పంట దెబ్బతింటుందని 4 రోజుల క్రితమే చైన్ హార్వెస్టర్‌తో వరి పంటను కోయించాను. గత ఏడాది గంటకు చైన్ హార్వెస్టర్ అద్దె 2800 నుంచి రూ.3000లు ఉండగా ఇప్పుడు అదనంగా రూ.500లు పెంచారు. అయినా తప్పడం లేదు.

- అనగూరి హరినాథరెడ్డి, పొలుగారిపల్లె, సీకేదిన్నె మండలం

స్థానికంగా యంత్రాలు లేక...



వరి కోతలు ఒక్కసారిగా వచ్చాయి. కూలీల కొరత ఎక్కువగా ఉంది. వరికోత యంత్రాలకు డిమాండ్ ఎక్కువైంది. పండిన పంటను ఏదోక విధంగా కోత కోయించి సొమ్ము చేసుకునేందుకు వరికోత యంత్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ యంత్రాలు స్థానికంగా లేకపోవడంతో దూరప్రాంతాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తోంది. దీంతో వారు అడిగినంత చార్జీలు చెల్లించక తప్పడం లేదు.

- మునెయ్య, వెంకటగారిపల్లె, సీకే దిన్నె మండలం

కూలీలు దొరకడం లేదు



నేను రెండున్నర ఎకరాలలో వరి పంటను సాగుచేశాను. ఒక పక్క వరి కోతలకు కూలీలు దొరకడం లేదు. ఇప్పుడేమో వర్షం పట్టుకుంది. బాడుగలు ఎక్కువ చెబుతున్నా చైన్ హార్వెస్టర్‌తో కోతలు కోయించుకుంటున్నాం. ఒక ఎకరా వరికోతకు రూ.3500లు చెల్లించాను. ఇలా దాదాపు ఐదు గంటలు పైనే సమయం పట్టడంతో రూ.10వేలు వరకు చెల్లించాల్సి వచ్చింది.

- ఎ.రవిశంకర్‌రెడ్డి, పొలుగారిపల్లె, సీకేదిన్నె మండలం

రౌడీషీటర్ పప్పీ హత్య కేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భక్తవత్సలం

ప్రొద్దుటూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలు మనసులో పెట్టుకుని పప్పీ అలియాస్ కొప్పుల రాఘవేంద్రను ఎనమల లోకేష్‌రెడ్డి మరో ఇద్దరు కలిసి హత్య చేసినట్లు డీఎస్పీ భక్తవత్సలం వెల్లడించారు. స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఆవరణలో శనివారం హత్యకేసుకు సం బంధించి వివరాలు తెలిపారు. లోకేష్‌రెడ్డికి పప్పీకి మధ్య స్నేహంతో పాటు మనస్పర్థలు ఉండేవి. ఈ నేపథ్యంలో డిసెంబరు 1న ఆదివారం లోకేష్‌రెడ్డికి పప్పీ ఫోన్ చేసి డబ్బులు అడిగాడు. డబ్బులు లేవు కావాలంటే బీజీఆర్ లాడ్జికి వస్తే మందు పార్టీ ఇస్తానని లోకేష్ రెడ్డి ఆఫర్ చేశాడు. ఆదివారం రాత్రి బీజీఆర్ లాడ్జికి పప్పీ వెళ్లగా.. అప్పటికే లాడ్జిలోని రూములో లోకేష్‌తో కలిసి సునీల్‌రెడ్డి, ముజీబ్‌లు మందు తాగుతూ వున్నారు. పప్పి వచ్చిన తర్వాత అందరూ కలిసి మందు తాగుతుండగా మాటామాటా పెరిగి నీవెంత అంటే నీవెంత అంటూ టీరాలకు పోయి ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో పప్పీ రెచ్చిపోయి వారి మీద దాడి చేయడంతో ఆ ముగ్గురు కలిసి పప్పీని మందుబాటిల్‌తో తలపై కొట్టారు. దీంతో పప్పీ స్పృహతప్పి కింద పడిపోయాడు. దాడి తర్వాత పప్పీ బతికితే మళ్లీ తమ ప్రాణాలకు ఎక్కడ ముప్పు ఉం టుందోనని పప్పీ కాళ్లను అదిమిపట్టి గొంతునులిమి చంపినట్లు నింది తులు విచారణలో వెల్లడించారని డీఎస్పీ తెలిపారు. కాగా, నిం దితులు ముగ్గురు ఆర్టీపీపీ రోడ్డులో ఉండగా వన్‌టౌన్ సీఐ రామ క్రిష్ణారెడ్డి, ఎస్ఐ సంజీవరెడ్డిలు అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

మంగంపేటలో దారుణ హత్య

ఓబులవారిపల్లె, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యో తి): మంగంపేట గ్రామంలో గుట్ట ఆంజనే యులు(55) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. గ్రామస్థుల వివరాల మేర కు.. మృతుడు ఆంజనేయులు వికలాంగుడు కాగా ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు రమణ, వెంకటేశ్, కుమార్తె సుభాషిణి ఉన్నారు. పెద్ద కుమారుడుకి పెళ్లి అయ్యింది. శుక్రవారం రాత్రి నిద్రిస్తున్న అతని తలపై పదునైన ఆయుధంతో దాడి చేయడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. ఘటనకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు చేరవేయగా రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె ఎస్ఐ మహేష్‌లు సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించి.. అనుమానా స్పదంగా ఉండడంతో కేసు నమోదు చేసి పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తొమ్మిది మందిపై కేసులు నమోదు

చాపాడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రిపల్లెలో జరిగిన ఘర్షణకు సంబంధించి శనివారం తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి వద్ద ఆటో నిలిపే విషయమై శుక్రవారం భద్రిపల్లె గ్రామానికి చెందిన బండి రమేష్, మోకాటి ఓబులేసులు ఘర్షణకు పాల్పడ్డారు. దీంతో ఇరువర్గాల వారు ఒకరిపై మరొకరు కట్టలు, రోకలి బడెలతో దాడులకు పాల్పడ్డారు. దీంతో ఓబులేసు, ఓబన్న, వెలుగమ్మ, రమేష్, సూర్యం, శ్యామల, అనూరాధలకు గాయాలయ్యాయి. ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై కేసులు నమోదు చేశామన్నారు.

స్కూటర్‌ను ఢీకొన్న కారు... ఇద్దరికి తీవ్రగాయాలు





ప్రమాదంలో గాయపడిన నారాయణరెడ్డి, రామసుబ్బమ్మ

కాశినాయన డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం వద్ద ప్రదాన రహదారిపై శనివారం స్కూటర్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వివరాల మేరకు... లింగారెడ్డిపల్లెకు చెందిన అంబవరం నారాయణరెడ్డి, కొత్తపల్లె రామసుబ్బమ్మలు స్కూటర్‌పై ఉప్పలూరు గ్రామానికి వెళుతుండగా... అదే సమయంలో పోరుమామిళ్ల నుంచి కలసపాడు వస్తున్న కారు ఓబుళాపురం గ్రామసమీపంలో స్కూటర్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో రామసుబ్బమ్మ, నారాయణరెడ్డిలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గుర్తించి స్థానికులు 108కు సమచారం అందించి పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.

కారు, ఆటో ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు



గాయపడ్డ మునెమ్మ

ముద్దనూరు డిసెంబరు7 (ఆంధ్ర జ్యోతి):మండల పరిధి పులివెందుల రహదారిలోని పుల్లేరు వంక సమీపంలో శనివారం రాత్రి కారు ఆటో ఢీకొన్న సంఘటనంలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి.స్థానికుల సమాచారం మేరకు వివరాలు... కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన అగ్గిరాజు(60),మునెమ్మ(55)లు ఆటో వెళ్ళి ఫ్యాన్సీ సామానులు వ్యాపారం చేస్తుంటారు. పులివెందుల వైపు నుంచి ఆటో లో వస్తున్నారు. జమ్మలమడుగు నుంచి ధర్మవరంకు కారు వెళుతుంది.పుల్లేరు వంక సమీపంలో రోడ్డుకు ఏర్పడ్డ పెద్ద గుంత వద్దకు రాగానే గుంతను తప్పించబోయి కారు ఆటో ఢీకొన్నాయి.దీంతో ఆటోలో ఉన్న అగ్గిరాజు, మున్నెమ్మకు గాయాలయ్యాయి. ఆటో బోల్తాపడగా, కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యాను ఢీకొనడంతో ఒకరికి..



గాయపడ్డ వ్యక్తి రఘురామయ్య

పోరుమామిళ్ల, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): పోరుమామిళ్ల సమీపంలోని మల్లక తవ వద్ద మినీ లగేజీ వ్యాను స్కూటరును ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గోపవరం మండలం లెక్కలూరి గ్రామానికి చెందిన గాలి రఘురామయ్య కాశినాయన మండలంలో ఉన్న తన కూతురు వద్దకు వెళుతుండగా మల్లకతవ మలుపులో వ్యాను అదుపు తప్పి స్కూటరును ఢీకొంది. సమాచారం తెలిసిన ఎస్ఐ కొండారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వ్యక్తిని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గోపరాజుపల్లెలో ఘర్షణ... ఒకరికి గాయాలు



పెండ్లిమర్రి, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గోపరాజుపల్లెలో శని వారం ఇరువర్గాల వారు ఘర్షణ పడటంతో నంద్యాల సుబ్బరాయుడు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు జరిగాయి. ఈ నేపథ్యంలో పాతకక్షల కారణంగా ఇరువర్గాల వారు ఆధిపత్యం కోసం ఈ ఘర్షణకు పాల్పడినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

వేముల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేముల ప్రధాన రహదారిపై స్థానిక వెంకటేశ్వరస్వామి గుడి వద్ద ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. తొండూరు మండలం మడూరు గ్రామానికి చెందిన మిద్దె విశ్వనాధ్ తన బంధువుల గ్రామమైన గొందిపల్లెకు పులివెందుల నుంచి బైకుపై వస్తుండగా వేములలో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

టీచర్ ఎజాజ్ కుటుంబానికి న్యాయం చేయాలి

- ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు

కడప కలెక్టరేట్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి ఉర్దూ హైస్కూలులో ఫిజికల్ సైన్స్ మాస్టర్ ఎజాజ్ అహమ్మద్ విద్యార్థుల దాడిలో మరణించడం విచారకరమని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఏపీ ఎన్జీవో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసు లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్, జిల్లా కార్యదర్శి రవికుమార్‌లు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా ఎన్జీవో కార్యాలయంలో వారు మాట్లాడుతూ పాఠశాల దశలోనే విద్యార్థుల ఆలోచన తీరు దారుణంగా మారడం బాధాకరమన్నారు. ఇలాటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు మేలు జరిగేలా ప్రభుత్వం ప్రజా ప్రాతినిధ్యం చట్టం రూపొందించాలన్నారు. ఇప్పటికే జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలసి టీచర్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరామన్నారు. ఎన్జీవో సంఘం నేతలు బాలపుల్లయ్య తమ్మారెడ్డి, కె.చిన్నయ్య, శైలేశ్వరరెడ్డి, శ్రీనివాసన్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలి

- జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి



కేంద్ర కారాగారంలో భోజనాలను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం మహిళ, పురుషుల కేంద్ర కారాగారాలతో పాటు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఆమె విజిట్ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖైదీలు ఉచిత న్యాయసహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి కేసుల వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. జైలు పరిసరాలను, వంట గదులను, వసతి గదులను, రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలను, సలహాలు ఇచ్చారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయసహాయం, లీగల్ సర్వీస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 గురించి అవగాహన కల్పించారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

మహిళలకు సమాన ప్రాధాన్యతనివ్వాలి

- ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త కల్పనా కన్నాబిరాన్



కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో మహిళలకు సమాన ప్రాధాన్యత కల్పించడం ద్వారా లింగ సమానత్వం సాధ్యమవుతుందని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త, కౌన్సిల్ ఫర్ సోషల్ డెవల్‌మెంటు న్యాయవిద్వాంసులు ప్రొఫెసర్ కల్పనా కన్నాబిరాన్ అన్నారు. వైవీయూ అంతర్గత ఫిర్యాదుల కమిటీ, లైంగిక వేధింపుల నిరోధక కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో జండర్ జస్టిస్ అండ్ కానిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియా పేరుతో శనివారం వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంప్రదాయక సామాజిక ఆలోచన సమాజంలో లోతుగా పాతుకుపోతున్నట్లయితే లింగ సమానత్వ లక్ష్యాలను సాధించదన్నారు. ముందుగా అది కుటుంబంలోని పిల్లల నుంచి సారస్వతిక అభ్యాసాలు స్వీయ స్పృహ, ప్రవర్తన ద్వారా రావాలని దిశ నిర్దేశం చేశారు. ఆర్టికల్ 14, 15, 106వ సవరణ చట్టం వంటి వివిధ ఆర్టికల్స్ ద్వారా లింగ న్యాయాన్ని ప్రోత్సహించడానికి రాజ్యాంగం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను అందించి సమానత్వం అనే ఆలోచనను ప్రతిబింబిస్తుందన్నారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి మాట్లాడుతూసమాన అవకాశాలు కల్పించడం ద్వారా స్త్రీ పురుషుల మధ్య అసమానతలు తొలగించవచ్చన్నారు. అనంతరం రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి వెబ్‌నార్ కన్వీనరు ప్రొఫెసరు అనిత మాట్లాడారు.

వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం రాజమార్గం

- మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కడప రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్తం రాజమార్గం లాంటిదని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ సభ్యులకు, న్యాయవాదులకు మధ్యవర్తిత్వం అనే అంశంపై సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్‌ను శనివారం ఉదయం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ అని... ఇది వివాదాలను పరిష్కరిస్తున్న మంచి పద్ధతి అన్నారు. ఖర్చు, సమయాన్ని ఆదా చేస్తుందన్నారు. మధ్యవర్తిత్తం వలన వ్యక్తిగత సంబంధాలు చెడవన్నారు. మధ్యవర్తిత్వం నియమాలు 2007, సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వము, ప్రాజెక్టు కమిటీ నిబంధనలు 2015, మధ్యవర్తిత్వ చట్టం 2023, సివిల్ ప్రొడక్షన్ కోడ్ 1908, మధ్యవర్తిత్వం, రాజీ చట్టం 1996, మీడియేషన్ యాక్టు 2023 తదితర అంశాలను వివరించారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టం పై వర్క్‌షాపు

లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013, లింగ సున్నితత్వం తదితర అంశాలపై బార్ అసోసియేషన్ సభ్యులకు న్యాయవాదులకు సాయంత్రం వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరావు, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్‌లు మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురైనపుడు పోష్ చట్టం 2013 కింద ఫిర్యాదు చేయవచ్చన్నారు. పోష్ చట్టంలోని సెక్షన్ 12(3) ప్రకారం పేర్కొన్న సంఘటనపై ఇతర చట్టాల వర్తింపుతో పాటు పేర్కొన్న శ్రామిక మహిళకు పరిహారం కోసం అపరాదుల జీతం తీసివేయడం జరుగుతుందన్నారు. పోష్ చట్టంలోని సెక్షన్ (3) గురించి వివరించారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు బి.గురప్పనాయుడు, మీడియేషన్ న్యాయవాది చంద్రకాంతమ్మ పాల్గొన్నారు.

విద్యారంగంలో నూతన అధ్యాయం

● విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి ● విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వక్తలు వెల్లడి


మదనపల్లె జడ్పీ హైస్కూల్‌లో మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, దాత, రిటైర్డు ఎంఈవో రెడ్డిసుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి


ములకలచెరువులో విద్యార్థినికి బహుమతులు అందజేస్తున్న జనసేన ఇన్‌చార్జి సాయినాథ్, ఎస్ఐ నరసింహుడు

మదనపల్లె అర్బన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ద్వారా విద్యారంగంలో నూతన అధ్యాయానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మదనపల్లె జడ్పీహైస్కూల్, నీరుగగట్టు వారిపల్లె రామిరెడ్డి లేవుట్‌లని వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులను సక్రమంగా చదివించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. స్కూల్లో టాయిలెట్స్ నిర్మిస్తామన్నారు. తల్లిదండ్రులు బాలికల కోసం ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరగా ప్రతి రోజు డాక్టర్ వచ్చి విద్యార్థునులను పరీక్షలు నిర్వహించేలా చూస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థుల కోసం ఏ అవసరం ఉన్నా తన దృషికి తీసుకురావాలని హెచ్‌ఎంను ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.50 లక్షలతో విద్యార్థులు భోజనాలు చేయడానికి అనుకూలంగా డైనింగ్ హాల్ నిర్మించామన్నారు. ఏపీ బాలుర గురుకుల పాఠశాలలో మెగా పేరం ట్స్, టీచర్స్ మీటింగ్‌లో పాఠశాలలో చాలా వరకు సమస్యలు ఉన్నట్లు పేరంట్స్ ప్రిన్సిపాల్‌కు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మార్పూరి నాగార్జున, బాబీ, తాళ్లగిరి, సురేంద్రరెడ్డి, గుత్తికొండ త్యాగరాజు, జనసేన నేత శ్రీరామరామాంజనేయులు, ప్రసాద్‌కుమార్, స్కూల్ కమిటీ చైర్మన్లు చంద్రకళ, భారత్మ, వైస్‌చైర్మన్లు నానుపునాయక్, అక్బర్‌ఖాన్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

పీలేరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం శనివారం పీలేరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాఠశాలల్లోని లోటుపాట్లు, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల ప్రతిభను తెలుసుకునేందుకు పేరెంట్స్ టీచర్ మీటింగ్‌ను నిర్వహిస్తున్నారన్నారు. పీలేరు నియోజకవర్గాన్ని విద్యా హబ్‌గా తీర్చిదిద్దేందుకు తన అన్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల, పలు పాలి టెక్నిక్ కళాశాలలు, సైనిక్ స్కూల్‌తోపాటు మరెన్నో విద్యాసంస్థలు తీసుకువచ్చారన్నారు. అనంతరం పాఠశాల పూర్వ విద్యార్థి, రిటైర్డు ఎంఈవో రెడ్డిసుబ్రహ్మణ్యంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో లు లోకేశ్వర రెడ్డి, పద్మావతమ్మ, టీడీపీ నేతలు కోటపల్లె బాబురెడ్డి, మల్లెల రెడ్డిబాషా, పురం రామ్మూర్తి, కోటపల్లె శ్రీనాథరెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, రియాజ్, చిన్నా పాల్గొన్నారు.

ములకలచెరువులో: మండలంలో శనివారం మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కమిటీ సమావేశాలు ఘనంగా జరిగాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పండగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించారు. ములకలచెరువు మోడల్ స్కూల్‌లో జరిగిన సమావేశంలో తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, టీడీపీ నేత మంత్రి గిరిధర్‌రెడ్డి, ఎంపీడీవో హరినారాయణ, ఎస్ఐ నరసింహుడు, వైద్యాధికారిణి జాహ్నవి, ప్రిన్సిపల్ కవిత పాల్గొన్నారు.

విద్యే జీవితానికి వెలుగుబాట

బి.కొత్తకోట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):విద్య జీవితానికి వెలుగుబాట అని టీడీపీ రాష్ట్రకార్యదర్శి ఎస్ఎం పర్వీన్‌తాజ్, తంబళ్లపల్లె టీడీపీ నేత దాసరిపల్లె జయచంద్రారెడ్డిలు పేర్కొన్నారు. శనివారం బి.కొత్తకోట మండలంలోని జడ్పీ బాలికల పాఠశాల, కేజీబీవీ, బీసీకాలనీ ఎంపీపీ స్కూల్‌లలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఆత్మీయ సమావేశం సందర్భంగా సాంస్కృతిక, ఆటలపోటీలు నిర్వ హించారు. బీసీకాలనీ ఎస్ఎంసీ ఛైర్మన్ రూహీ జాస్మిన్‌ను జయచంద్రారెడ్డి సన్మానించారు. కార్యక్ర మాలలో నగరపంచాయతీ కమిషనర్ జీఆర్ పల్లవి, తహశీల్దార్ మహమ్మద్ అన్సారీ, ఎంపీడీవో శంకరయ్య, ఎంఈవో2 భీమేశ్వరాచారి, టీడీపీ నాయకులు కుడుంశ్రీనివాసులు, వెంకట్రమణ, నారాయణ, చావిడికిట్టన్న, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్రంకొండలో:విద్యార్థి దశ చాలా కీలకమైనదని ఎంఈవో సురేంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో శనివారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, నౌషాద్, మురళీ, చంద్రబాబు, ప్రదీప్, నౌషాద్ అలీ, చలమారెడ్డి, నరసింహులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపు నిచ్చారు. మండలంలోని పెద్దమండ్యం, కలిచెర్ల హైస్కూల్, మోడల్ స్కూల్‌తో పాటు అన్ని పాఠశాలల్లో పీటీఎం కార్యక్రమాలు ప్రారం భించారు. ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్, తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఎంఈవో మనోహర్, రామకృష్ణ, ఎస్ఐ రమణ, హెచ్‌ఎంలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ పండుగ వాతావరణంలో నిర్వహించారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తంబళ్లపల్లె ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో నిర్వహించిన పీటీఎంకు ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఎంఈవో త్యాగరాజు, ఎస్ఐ లోకేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు రోప్ లాగడం వంటి పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

కురబలకోటలో: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ ధ్యేయమని తంబళ్ళపల్లె నియోజకవర్గ నేత జయచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రమాదవ్, టీడీపీ మాజీ మండల కన్వీనర్ జంగారాఘవరెడ్డిలు పేర్కొ న్నారు. శనివారం మండలంలోని పాఠశాలల్లో మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బి.జ్యోతి, ఎంపీడీవో గంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ వైజి సురేంద్ర, అయూబ్ బాషా, రమణ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని వాల్మీకిపురం ఎంపీడీవో మనోహర్‌రాజు పేర్కొన్నారు. శనివారం మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల పట్ల పాఠశాల ఉపాధ్యాయులే కాకుండా తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలని వక్తలు సూచించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. వాల్మీకిపురం పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఎంఈవోలు వెంకటరత్నం, వెంకటలక్ష్మి, ఎస్ఐ చంద్రశేఖర్, ఈవో రవీంద్రనాథ్, హెచ్‌ఎంలు పాఠశాల కమిటీ చైర్మన్‌లు, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకే అన్ని పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం నాయకుడు దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం . రంగసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, పాఠశాల చైర్మెన్ దాసరి శంకర, వైస్ చెర్మెన్ చింతమాను శైలజ అధ్వర్యంలో సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేంచేందుకే విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులను భాగస్వాములను చేస్తోందన్నారు. సమావేశంలో ఎంఈవోలు నారాయణ, గౌస్‌పీర్, పీటీఎం పాఠశాల చైర్మన్ నరసింహులు, తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఎస్ఐ రవికుమార్, టీడీపీ నాయకులు బందార్ల వెంకట్రమణ,, టైలర్ రామాంజులు,తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బి.కొత్తకోటలో మాట్లాడుతున్న టీడీపీ నేత పర్వీన్‌తాజ్


పీటీఎం రంగసముద్రం ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశం సందర్భంగా పెద్దమండ్యంలో టగ్ అఫ్ వార్ పోటీలో పాల్గొన్న స్థానికులు

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి అంబలం పూజ


వాల్మీకిపురం మండలం కూరపర్తిలో అయ్యప్పస్వామి అంబలం పూజ

వాల్మీకిపురం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలంలోని కూరపర్తి గ్రామంలో శుక్రవారం రాత్రి అప్పయ్యస్వామి అంబలం పూజా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని ఆలయంలో గణపతి సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వాములకు అంబలం కట్టి అభిషేకాలు, విశేషాలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలంతా భక్తి భావంతో పాల్గొని తరించారు. వేడుకల అనం తరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న వితరణ చేపట్టారు. కార్యక్రమాలలో గురుస్వామి రామచంద్ర, శీనా, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప భక్తుల ర్యాలీ..

రాయచోటిలో చోటుచేసుకున్న అయ్యప్ప భక్తులపై దాడికి యత్నానికి నిరసనగా ఆదివారం వాల్మీకిపురం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు గురుస్వామి రామచంద్ర పేర్కొన్నారు. స్థానిక అయ్యప్పస్వామి దేవాలయం నుంచి ఆదివారం ఉదయం చేపట్టనున్న నిరసన ర్యాలీకి అయ్యప్ప భక్తులతో పాటుగా హిందువులంతా ఐక్యమత్యంతో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఒంటిమిట్ట చెరువుకు నీరు అందించాలి

ఒంటిమిట్ట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట చెరువుకు వెంటనే నీరు అందించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్క ర్ అన్నారు. ఒంటిమిట్ట చెరువుకు నీరు అందక రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని ప్రత్యక్షంగా, పరోక్షంగా రైతులకు ఎంతో ఉపయోగకరమైన నీటిని ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వహించి చెరువుకు నీరు అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. సోమశిల వెనుకజలాల నుంచి శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా ఒంటిమిట్ట చెరువుకు నీరివ్వాలని, 2014-2019 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు రైతుల కోసం ప్రారం భించారన్నారు. సమావేశంలో రైతులు పాల్గొన్నారు.

కమనీయం సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం


మదనపల్లెలో ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి


కలకడలో సుబ్రహ్మణ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మనపల్లె రోడ్డులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం నాల్గోవార్షికోత్సం సందర్భంగా సుబ్ర హ్మణ్యస్వామి కల్యాణం అంగరంగవైభవంగా కమనీయంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు రాచపల్లె సుబ్రహ్మణ్యం, రాచపల్లె అనురాధ ఆధ్వర్యంలో ముందుగా పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు స్వామి దర్శనానికి వెళ్లడానికి బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు సుబ్రహ్మణ్యంస్వామిని దర్శించుకున్నారు. ఆలయం ముందుభాగంగా వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి విగ్రహాలను ఏర్పాటు చేసి శోస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి లడ్డుప్రసాదం వేలం నిర్వహించగా రూ. 42 వేలకు మంజు అనే భక్తుడు వేలంలో లడ్డును దక్కించుకున్నారు. దీనిని ఆలయాభివృద్ధికి వినియోగించనున్నట్లు ధర్మకర్తలు పేర్కొన్నారు. ఆలయ ఆవరణం ఆధ్యాత్మికతతో సంతరించకుంది.

కలకడలో:కలకడ కామాక్షి సమేత సిద్ధేశ్వర ఆలయంలో శనివారం అర్చకులు సుబ్రమణ్యస్వామి, విజయసారధి ఆధ్వర్యంలో వళ్లీదేవసేనా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పంచామృతాభిషేకం, పుణ్యాహావచనం, కల్యాణోత్సవం నిర్వహించారు. ఉభయదారులుగా మద్దిపట్ల వెంకటరమణనాయుడు, కొండమ్మ దంపతులు వ్యవహరించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం : డీఎస్పీ


మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ వద్దు అంటూ పోస్టర్‌ను అవిష్కరిస్తున్న డీఎస్పీ కొండయ్యానాయుడు

మదనపల్లె అర్బన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి విద్యా ర్థులు కృషి చేయాలని మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో డ్రగ్స్ వాడకంపై వచ్చే అన ర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్బం గా డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటుపడితే చాల కష్టమన్నారు. అలవాటు ఉన్న తల్లిదండ్రులు పిల్లల వద్ద వాడరాదని, వారి నుంచి తెప్పించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే సీటీఎం జడ్పీ హైస్కూల్‌లో ప్రభుత్వం నిర్వహించిన స్టూడెంట్స్ పేరెంట్స్ ఇంట్రడక్షన్ కార్యక్రమాన్ని మదనపల్లె తాలుకా సీఐ కళావెంకటరమణ హాజరై సైబర్ నేరాలు, డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: డ్రగ్స్ రహిత సమాజమే ధ్యేయంగా విద్యార్థులు ఎదగాలని మదనపల్లి సీఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం మండ లంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూ లనకు ప్రత్యేక దృషి సారించిందని దీనికి గానూ ప్రస్తుతం డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టి విద్యార్థులలో చైతన్యం తీసుకొచ్చేం దుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సైబర్ నేరాలపై జాగ్రత్త ఉండాలని సెల్ ఫోన్‌ను వచ్చే లింకులను తాకరాదని తెలిపారు. ఎక్కువగా ఇన్‌స్టాగ్రామ్‌ను పిల్లలు వాడుతున్నట్లయితే వెంటనే దానిని డిలీట్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, ఎంఈవో పద్మావతి-1, ఎంఈవో నారాయణ-2, స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐ, అధికారులు

నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

● ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి
● పీలేరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద ప్రత్యేక పూజలు


సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలో నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పీలేరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు శనివారం పూర్తిగా నిండడంతో ఆయన ట్యాంకు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీలేరు పట్టణానికి ఎంతో ఉపయోగపడే కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు పింఛానది నుంచి సప్లై ఛానెల్‌కు మరమ్మతులను గత ప్రభుత్వం పూర్తిగా మరిచిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పింఛానదిలో నీరు పుష్కలంగా ప్రవహిస్తుండడంతో తాము చొరవ తీసుకుని మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు యల్లెల రెడ్డప్ప రెడ్డి ద్వారా సప్లై ఛానెల్స్‌కు మరమ్మతులు చేయడమే కాకుండా నీటి మళ్లింపు పనులు చేపట్టామన్నారు. నెలన్నర రోజులు కష్టపడితే సమ్మర్ స్టోరేజ్ నిండిందని, మరో రెండేళ్లపాటు పీలేరు ప్రజలకు నీటి సమస్య ఉండబోదన్నారు. ఇదే స్ఫూర్తితో పీలేరు అయ్యప్పనాయుని చెరువుకు కూడా నీటి మళ్లింపు చర్యలు చేపట్టామన్నారు. అంతే కాకుండా కేవీపల్లె, కలకడ, కలికిరి మండలాలకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఝరికోన ప్రాజెక్టు మోటార్ల రిపేర్లకు రూ.60 లక్షల నిధులు మంజూరు చేయించామన్నారు. అడవిపల్లె ప్రాజెక్టుకు త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నింపడానికి కృషి చేసిన యల్లెల రెడ్డప్ప రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులు దేశరక్షణ కోసం పాటుపడాలి



మిట్స్‌లో భారత సైనిక దళాల పతాక దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

కురబలకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ విద్యార్థులు క్రమశిక్షణతో దేశరక్షణ కోసం పాటుపడాలని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో భారత సైనిక దళా ల పతాక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర జవానుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులు సేవా దృక్పథంతో ముందుకు సాగడంతో పాటుగా దేశసమస్య విపత్తుల సమయంలో సేవలను అందించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం వీర జవానుల సహాయార్థం రూ.15వేల విరాళాన్ని సేకరించి సైనిక వెల్ఫేర్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ తులసీరామ్‌నాయుడు, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ నవీన్‌కుమార్, ఎన్‌సీసీ క్యాడెట్స్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు వితరణ



కలికిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలికిరి గాంధీ సర్కిల్ సమీపంలోని ఈద్గా మసీదు వద్ద శనివారం రాత్రి పేదలకు దప్పట్లు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు నిరాశ్రయులు, భిక్షాటన చేసే వారిని గుర్తించి దుప్పట్లు పంచిపెట్టారు. అంతకు ముందు స్థానిక సర్వోదయ వృద్ధాశ్రమంలో బెడ్ షీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్ర మంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రెడ్డిబాషా, సాదిక్, బాబ్జాన్, అస్‌గర్, నబీ, నూరూ, సుఫీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పట్ల మొగ్గు చూపాలి


మహిళా సభ్యులకు చిరుధాన్యాలను పంపిణీ చేస్తున్న ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది

తంబళ్లపల్లె, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల మొగ్గు చూపి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రకృతి వ్యవసాయాన్ని అలవరుచు కోవాలని ఏపీసీఎన్ఎఫ్ జూనియర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ పవన్, ఎన్ఎఫ్ఏ సునీత సూచించారు. శనివారం ఎర్రసానిపల్లెలో ఆర్‌వైఎస్ఎస్, ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో బాగంగా ఆరోగ్యం-పోషణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన చిరుధాన్యాలు, పప్పుధాన్యాల ఫుడ్‌బాస్కెట్‌ను గర్భవతులు, బాలింతలు, కిషోర బాలికలు, 72 నిరుపేద మహిళా సంఘాల సభ్యుల కుటుంబాలకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి కుటుంబం రసాయన రహిత ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది సునీత, పద్మావతి, రాజు, రఘునాథ్, నిజాం, సుజాత, కూటమి నాయకులు, మహిళాసభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు చేతికర్రలు, వినికిడి యంత్రాలు వితరణ


వృద్ధులకు చేతికర్రలు పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్

మదనపల్లె అర్బన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువు మిట్టలోని వెలుగు వృద్ధాశ్ర మంలో శనివారం వృద్ధులకు చేతికర్రలు, వినికిడి యంత్రాలను మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్, శ్రీకృష్ణగ్రాఫ్స్ అధినేత శశిధరరావులు పంపిణీ చేశారు. దివ్యాంగులకు ఉచిత షెల్టర్ హోమ్‌ను అక్కడి చిన్నారులు తయారు చేసిన అగరబత్తీలు, దీపం ఒత్తులు, ప్రమిదలు, బుట్టలు అల్లికలను వారు వీక్షించారు. వెలుగు ప్రత్యేక పాఠశాల్లో తరగతి గదులను, కంప్యూటర్ ట్రైనింగ్ ఫిజియోథెరపి, మీటింగ్ హాల్‌ను సబ్‌కలెక్టర్ సందర్శించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా చిన్నారులు నృత్యప్రదర్శనతో అందరినీ అలరించారు. వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మీ, ప్రిన్సిపాల్ లీనాకుమారి, స్వీటీ, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మద్దతుగా ఐక్యత చాటిన బీసీ నేతలు


ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ నాయకులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు బీసీ నేతలు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎదుగలను ఓర్వలేక చౌకబారు ఆరోపణలు చేయడం తగదన్నారు. టీడీపీ బీసీ నాయకుడు, కురబసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లే రెడ్డిప్రసాద్ శనివారం టీడీపీ నాయకులతో కలిసి ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పూలే వర్ధంతి సందర్భంగా విగ్రహ సుందరీకరణకు నిధుల మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చి వెంటనే మాట నిలుపుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నీలకంఠ, మోడెం సిద్దప్ప, కమలమరికృష్ణ, సోమశేఖర్‌నాయుడు, మాజీ ఎంపీపీ మేష రామ కృష్ణ, తవళం రజన్న, ముసలికుంట నాగయ్య, దుబ్బిగాళ్ల భాస్కర, చిప్పిలి గురునాత్ యాదవ్, మేస్త్రీ శ్రీన, విజయమ్మ, నాగమణి, బండిఅమర తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి):బెంగళూరులో చికిత్స పొందుతూ జయకుమార్‌రెడ్డి(30)అనే యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కురబలకోట మండలం రెడ్డివారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి కుమారుడు జయకుమార్‌రెడ్డి టమోటా పంటలో నష్టం రావడంతో అప్పులు ఎక్కువై మనస్థాపానికి గురై ఈ నెల 5న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు వైద్యులు రెఫర్ చేశారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడన్నారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.